@vaartanews @mvnewstv
www.mivaartanews.com
TGBIL/25/A0512
మీ... మన వార్త
AP EDITION
ప్రతి అక్షరం... ప్రజల కోసం
విజయవాడ
మంగళవారం 8 సెప్టెంబర్ 2026
సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-

వార్త
విలేకరులు కావలెను
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
96763 94932

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



# సైబర్ నేరాలపై పోలీసుల యుద్ధం

**"సైబర్ గార్డ్"తో 24X7 అలర్ట్**

**కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఐ4సీ తరహాలో స్టేట్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్**

**259 మందితో టీం, ఐజీ స్థాయి అధికారి నేతృత్వం**

**సిద్ధం చేస్తున్న పోలీసు శాఖ**

**అమరావతి**

సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా స్టేట్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ (ఎస్4సీ)ను రాష్ట్ర పోలీసు శాఖ ఏర్పాటు చేస్తోంది. ఈ విభాగానికి 'సైబర్ గార్డ్' అని పేరు పెట్టారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) తరహాలో దీన్ని తీర్చిదిద్దుతున్నారు. విజయవాడ–గుంటూరు మార్గంలో కాజ టోల్‌ప్లాజా సమీపంలోని ప్రభల టెక్‌పార్క్‌లో రూ.10.77 కోట్లతో దీన్ని నెలకొల్పుతున్నారు. 259 మందితో పనిచేయనున్న ఈ విభాగానికి ఐజీ స్థాయి అధికారి నేతృత్వం వహిస్తారు.

సైబర్ నేరాల దర్యాప్తు, డిజిటల్ ఫోరెన్సిక్, సైబర్ ఇంటెలిజెన్స్, సైబర్ దాడుల ముప్పు పర్యవేక్షణ, వివిధ శాఖలతో కలిసి సమన్వయంతో కూడిన ప్రతిస్పందన సహా పలు కీలక విధులను 'సైబర్ గార్డ్' నిర్వహించనుంది. ఇందుకోసం ప్రత్యేక దర్యాప్తు పరికరాలు, డిజిటల్ ఫోరెన్సిక్ టూల్స్, సైబర్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫాంలు, సాఫ్ట్‌వేర్‌లను సమకూరుస్తున్నారు. పోలీసు అధికారులు, సిబ్బందే కాకుండా సాంకేతిక నిపుణులు, సైబర్ ఎనలిస్ట్‌లు, డిజిటల్ ఫోరెన్సిక్ సిబ్బంది, బ్యాంక్, టెలికాం సంస్థల తరఫున వాటి సమన్వయకర్తలు, 24 గంటలూ పనిచేసే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు వచ్చే కాల్స్‌ను విశ్లేషించే సిబ్బంది ఇలా వివిధ విభాగాల సమాహారంగా సైబర్ గార్డ్ పనిచేయనుంది. త్వరలో అందుబాటులోకి రానున్న ఈ కేంద్రం ప్రత్యేకతలివీ. ఐపీ చిరునామాలు, బ్యాంక్ ఖాతాలు, టవర్ లొకేషన్‌లను ట్రాకింగ్ చేస్తారు. ఇతర మార్గాల ద్వారా నేరగాళ్ల ఉనికి, అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్థావరాలను గుర్తించి, దాడులు నిర్వహిస్తారు. ఐపీ చిరునామాలు, సర్వర్ లాగ్స్, ట్రాన్సాక్షన్ ఐడీలు, నెట్‌వర్క్ రికార్డులను సేకరించి భద్రపరుస్తారు. డిజిటల్ ఆధారాలు సేకరించి నేరగాళ్లకు శిక్షలు పడేలా చూస్తారు. సామాజిక మాధ్యమాలు, వెబ్‌సైట్‌లు, ఫోరంలలోని బహిరంగ - మిగతా3లో

# తాగునీటి కష్టాలకు చెక్




**తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం**

**రూ.2,370 కోట్లతో జలధార ప్రాజెక్టు పనులపై పవన్ దిశానిర్దేశం**

**తాగునీటి ఎద్దడి అధికంగా ఉన్న ప్రాంతాల్లో నీటి ప్రాజెక్టుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు**

**పవన్ కల్యాణ్ పర్యవేక్షణలో వేగంగా కొనసాగుతున్న ప్రాజెక్టు పనులు**



కీలక ప్రతిపాదనలకు

# రక్షణ శాఖ పచ్చజెండా

- రూ.1.10 లక్షల కోట్లతో ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోళ్లు
- రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ఆమోదముద్ర
- ఎయిర్ రూట్ సర్వైలెన్స్ రాడార్ల స్థానంలో ఈ అత్యాధునిక ఆరుద్ర రాడార్లు
- అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల కొనుగోలుకు డీఏసీ ఆమోదం

# కార్యకర్తలే పార్టీకి బలం

- వారిని ఉన్నతస్థాయికి తీసుకురండి
- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో చంద్రబాబు
- కార్యకర్తలను రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేయాలని ఎమ్మెల్యేలకు సీఎం సూచన
- సమస్యల పరిష్కారంలో మంత్రులు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టీకరణ
- స్వర్ణాంధ్ర విజన్–2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని పిలుపు
- ఆర్థిక ఇబ్బందులున్నా ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి కేటాయింపు



**అమరావతి**

తెలుగుదేశం పార్టీ నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు కీలక దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల రాజకీయ, ఆర్థిక సాధికారతకు కృషి చేయాలని, అదే సమయంలో స్వర్ణాంధ్ర విజన్–2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని స్పష్టం చేశారు. కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని, వారిని నిరాశకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "టీడీపీ కార్యకర్త హుషారుగా ఉంటే గెలుపును ఎవరూ ఆపలేరు. కార్యకర్తల్లో చాలా మంది పేదవారు ఉన్నారు. ప్రభుత్వ పథకాల ఫలాలు వారికి అందేలా చూడాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగా పనిచేసిన వారికి, అక్కడి పరిస్థితులను బట్టి టికెట్లు కేటాయిస్తాం. వారు వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందేలా ఎమ్మెల్యేలు ప్రోత్సాహం, మార్గనిర్దేశం అందించాలి. ప్రజలు మెచ్చే విధంగా కార్యకర్తలకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. జిల్లాల్లో, నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే బాధ్యతను మంత్రులు తీసుకోవాలని, లేనిపక్షంలో వారే జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని - మిగతా3లో



ప్రైవేటు రంగానికి

# ప్రోత్సాహం

- ఇస్రో ఒక్కటే అది చేయలేదు
- కచ్చితంగా ప్రైవేటు భాగస్వామ్యం అవసరం
- భారత అంతరిక్ష రంగాన్ని విస్తరించడంలో పరిశ్రమల పాత్ర పెరగాలి
- ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ కీలక వ్యాఖ్యలు

## ప్రభుత్వం 'అంకెల గారడీ'తో బిజీగా ఉంది

- ద్రవ్యోల్బణం పండుగల ఆనందాన్ని దెబ్బతీస్తోంది : కాంగ్రెస్
- మోదీ ప్రభుత్వం ప్రతి వారం ద్రవ్యోల్బణంతో ప్రజల జేబులు కొడుతోందని జైరాం రమేశ్ ఫైర్



స్వర్ణభారత్ ట్రస్ట్

25 ఏళ్లుగా సేవలు అందించడం

# అభినందనీయం

- యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్
- వెంకటాచలంలో స్వర్ణభారత్ ట్రస్ట్ రజతోత్సవం
- ముఖ్య అతిథిగా పాల్గొన్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్
- వేడుకలకు హాజరైన వెంకయ్యనాయుడు, మంత్రులు నారాయణ, సత్యకుమార్



**అమరావతి**

స్వర్ణభారత్ ట్రస్ట్ పేదపిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తోందని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. వారి కోసం అన్ని రకాల వసతులూ కల్పిస్తోందని చెప్పారు. పేదపిల్లలకు చదువు చెప్పడం అనేది గొప్ప సమాజ సేవన్నారు. యువతకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నారని వివరించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ రజతోత్సవంలో ఆయన ముఖ్య - మిగతా3లో


# కీలక ప్రతిపాదనలకు రక్షణ శాఖ పచ్చజెండా

దేశ త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణశాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఏకంగా 1.10 లక్షల కోట్ల రూపాయల వ్యయంతో ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోళ్లకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ పలు కీలక ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదం తెలిపింది. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా ఆమోదం పొందిన ప్రతిపాదనల్లో 98 శాతం దేశీయ రక్షణ రంగ సంస్థల నుంచే కొనుగోళ్లు చేయనున్నట్లు స్పష్టం చేసింది.

### రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ఆమోదముద్ర

సాయుధ దళాల ఆధునీకరణే లక్ష్యంగా ఈ ఏడాదిని 'సంస్కరణల సంవత్సరం'గా ప్రకటించిన రక్షణశాఖ త్రివిధ దళాల బలోపేతానికి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎలాంటి పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా సైన్యానికి అవసరమైన ఆయుధ పరికరాల సేకరణకు పచ్చజెండా ఊపింది. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ ఏకంగా రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదముద్ర వేసింది.

డీఏసీ ఆమోదించిన ప్రతిపాదనల్లో భారత సైన్యానికి అవసరమైన కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్, న్యూక్లియర్ రెక్కీ వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాలు



కలుషితమైన ప్రాంతాలను గుర్తించి, పర్యవేక్షించడంతో పాటు మార్కింగ్ చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయి. అత్యంత క్లిష్టమైన సరిహద్దు భూభాగాల్లో దళాల వేగవంతమైన కదలికలు, లాజిస్టిక్స్, ఆపరేషనల్ సపోర్ట్ కోసం హై మొబిలిటీ వెహికల్స్ కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రువులకు ముకుతాడు వేసేలా సవాలుతో కూడిన ప్రాంతాల్లో అత్యంత వేగంగా, సమర్థవంతంగా మందుపాతరలను అమర్చేందుకు సెల్ఫ్-ప్రొపెల్డ్ మెకానికల్ మైన్ లేయర్స్ కొనుగోలుకు సైతం ఆమోదముద్ర వేసింది. యుద్ధ సమయాల్లో క్లిష్టమైన భౌగోళిక ప్రాంతాల్లో అత్యంత సంక్లిష్టమైన మిషన్లలో కీలకంగా వ్యవహరించే అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు, ట్రాల్ ట్యాంకులు, సర్వత్ర బ్రిడ్జ్ సిస్టమ్, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది.

### ఎయిర్ రూట్ సర్వైలెన్స్ రాడార్ల స్థానంలో ఈ అత్యాధునిక ఆరుద్ర రాడార్లు

భారత నావికాదళం కోసం 'ఆరుద్ర' రాడార్లతో పాటు మెరైన్ గ్యాస్ టర్బైన్ల రూపకల్పన, అభివృద్ధి, కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. వివిధ నావల్ ఎయిర్ స్టేషన్లలో ప్రస్తుతం ఉన్న ఎయిర్ రూట్ సర్వైలెన్స్ రాడార్ల స్థానంలో ఈ అత్యాధునిక ఆరుద్ర రాడార్లను ప్రవేశపెట్టనున్నారు. యుద్ధనౌకలకు ఇంధన సిస్టమ్‌గా పనిచేసే మెరైన్ గ్యాస్ టర్బైన్ల కొనుగోలుతో ఇంజిన్ల విషయంలో విదేశీ సంస్థలపైన ఆధారపడటం తగ్గుతుందని రక్షణ శాఖ స్పష్టం చేసింది.

### 98 శాతం దేశీయ పరిశ్రమల నుంచే సేకరణ

భారత వాయుసేనకు చెందిన ఫైటర్ జెట్లు, రవాణా విమానాలు, హెలికాప్టర్ల యుద్ధ సామర్థ్యాన్ని పెంచే పలు ప్రతిపాదనలకు సైతం డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రుదేశాల నిఘా రాడార్లను సమర్థంగా అడ్డుకునే గ్రౌండ్-బేస్డ్ మల్టీ-పర్పస్ జామర్ల కొనుగోలుకు పచ్చజెండా ఊపింది. రక్షణ వ్యవస్థల భద్రతను డిజిటలైజ్ చేస్తూ 'డిఫెన్స్ ఫోర్సెస్ సెక్యూర్ యాక్సెస్ కార్డ్' వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు డీఏసీ అంగీకారం తెలిపింది. దీని ద్వారా దళాల్లో ఇప్పటివరకు ఉన్న పాత పేపర్ గుర్తింపు కార్డులు, పాస్‌లు, పర్మిట్ల స్థానంలో పరస్పరం పనిచేసే అత్యాధునిక స్మార్ట్ కార్డులను అమలు చేయనున్నారు. ఈ కొనుగోలులో 98 శాతం దేశీయ పరిశ్రమల నుంచే సేకరించనున్నట్లు రక్షణ శాఖ స్పష్టం చేసింది. తద్వారా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి మరింత ఊతమిస్తుందని వెల్లడించింది.

# ప్రైవేటు రంగానికి ప్రోత్సాహం

భారత అంతరిక్ష రంగాన్ని విస్తరించేందుకు మన దేశీయ పరిశ్రమలు, స్టార్టప్‌లు, విద్యాసంస్థల భాగస్వామ్యం మరింత పెరగాలని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ పిలుపునిచ్చారు. ఉపగ్రహాలకు, ప్రయోగాలకు పెరుగుతున్న డిమాండ్‌ను కేవలం ఇస్రో ఒక్కటే తీర్చలేదు అని ఆయన నొక్కి చెప్పారు. నేడు ప్రైవేటు రంగ భాగస్వామ్యం, సాంకేతిక పురోగతి, ప్రతిష్ఠాత్మక మిషన్లు, అంతర్జాతీయ సహకారంతో కూడిన కొత్త దశలోకి భారత అంతరిక్ష కార్యక్రమం అడుగుపెడుతోందని వి.నారాయణన్ పేర్కొన్నారు. బెంగళూరు స్పేస్ ఎక్స్‌పో 2026 (9వ ఎడిషన్)లో ప్రసంగిస్తూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

"ప్రస్తుతం అంతరిక్షంలో మనకు సంబంధించిన అసెట్స్? (ఉపగ్రహాలు) 56 మాత్రమే ఉన్నాయి. కానీ మన అవసరాలు తీర్చేందుకు ఇంకా చాలా ఉపగ్రహాలు కావాల్సి ఉంది. రానున్న 6-7 ఏళ్లలో కనీసం 200 నుంచి 300 ఉపగ్రహాలను తయారు చేసి ప్రయోగించాల్సి ఉంది. ఈ పనిని కేవలం ఇస్రో మాత్రమే చేయలేదు."

ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సంస్కరణలను తీసుకువచ్చిందని ఇస్రో ఛైర్మన్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రైవేటు అంతరిక్ష కార్యకలాపాలకు అనుమతులు ఇవ్వడానికి ఇన్?-స్పేస్? (×చీ-ౠూజవ) సంస్థ పనిచేస్తోందన్నారు. అలాగే వాణిజ్య పురోగతికి మద్దతు ఇవ్వడంలో 'న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్? ' (ఎన్?ఎస్?ఐఎల్?) కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. భారత అంతరిక్ష రంగానికి దేశీయ పరిశ్రమలు అందిస్తున్న సహకారాన్ని నారాయణన్? కొనియాడారు. ఒక రాకెట్ ప్రయోగానికి అయ్యే బడ్జెట్లో దాదాపు 80 శాతం నిధులు భారతీయ పరిశ్రమలకే వెళ్తాయని ఆయన గుర్తు చేశారు. "పీఎస్?ఎల్?వీ, జీఎస్?ఎల్?వీ, ఎల్?వీఎం3 లాంటివాటి




తయారీకి అయ్యే బడ్జెట్లో 80 శాతం భారతీయ పరిశ్రమలకే వెళ్తుందని మీరు అర్థం చేసుకోవాలి. భారత అంతరిక్ష కార్యక్రమం సాధిస్తున్న విజయం వెనుక మన దేశీయ పరిశ్రమలు, విద్యాసంస్థల భాగస్వామ్యం ఉందని మీరు గుర్తించాలి" అని ఆయన అన్నారు.

### ఎక్కువ ప్రయోగాలు చేయాల్సిందే!

ప్రస్తుతం మన దేశంలో అంతరిక్ష రంగానికి సంబంధించి దాదాపు 450 స్టార్టప్? కంపెనీలు పనిచేస్తున్నాయని వి.నారాయణన్? పేర్కొన్నారు. ప్రస్తుతం దేశీయ స్టార్టప్ వ్యవస్థ ఎంతో బలంగా ఎదుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే భారతదేశం తన అంతరిక్ష లక్ష్యాలను చేరుకోవాలంటే, రాకెట్ ప్రయోగాల సంఖ్యను గణనీయంగా పెంచాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. 'నేను 1984లో ఇస్రోలో చేరినప్పుడు, మూడేళ్లకు ఒకసారి లేదా రెండేళ్లకు ఒకసారి రాకెట్ ప్రయోగించేవాళ్లం. కానీ ఇప్పుడు నెలకొక ప్రయోగం చేస్తున్నాం. అయితే ఇది సరిపోదు. మనం ఏడాదికి దాదాపు 50 ప్రయోగాలు చేయాల్సిన అవసరం ఉంది. కాబట్టి మనమంతా కలిసికట్టుగా పనిచేయాలి' అని ఆయన పిలుపునిచ్చారు.

### ప్రైవేటు రంగం భేష్?!

ఇన్-స్పేస్? ఛైర్మన్? పవన్? గోయెంకా భారత్?లో ప్రైవేటు సంస్థలు అంతరిక్ష రంగంలో సాధిస్తున్న వేగవంతమైన పురోగతిని వివరించారు. 2014లో కేవలం ఒకే ఒక స్పేస్ స్టార్టప్? ఉంటే, ఇప్పుడు ఆ సంఖ్య 450 దాటిందని ఆయన అన్నారు. ఈ ఒక్క సంవత్సరంలోనే ప్రైవేటు రంగం నుంచి 160 మిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని ఆయన తెలిపారు. ఇస్రో, ప్రైవేటు పరిశ్రమలు, ఇన్?-స్పేస్? మధ్య పెరుగుతున్న భాగస్వామ్యానికి 'స్కైరూట్? ఏరోస్పేస్?' ఒక మంచి ఉదాహరణ అని గోయెంకా పేర్కొన్నారు. ఈ సంస్థ భారతదేశపు మొదటి ప్రైవేటను రాకెట్?ను అభివృద్ధి చేసి, కక్ష్యలోకి ఉపగ్రహాన్ని పంపే సామర్థ్యాన్ని సాధించిందని ఆయన గుర్తు చేశారు.

"ఈ భాగస్వామ్యమే భారతదేశానికి ఉన్న అసలైన బలం. 6 దశాబ్దాల ఇస్రో అనుభవం, నేడు ప్రైవేట్ రంగంతో చేతులు కలిపింది. ఇస్రో, ప్రైవేట్ సంస్థలు కలిసికట్టుగా ఎదుగుతున్నాయి. ఇస్రో, ఇన్?-స్పేస్?, ఎన్?ఎస్?ఐఎల్?, ప్రైవేటు కంపెనీలు, ఎంఎస్?ఎంఈలు, విద్యాసంస్థలు, పెట్టుబడిదారులతో కూడిన ఒక పూర్తి స్థాయి అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను భారత్? నిర్మిస్తోంది" అని పవన్? గోయెంకా తెలిపారు. భారత కంపెనీలు తమ సేవల విలువను మరింత పెంచుకుంటూ, ప్రపంచ అవసరాలను తీర్చాలని కోరారు. అలాగే అంతర్జాతీయ కంపెనీలు భారతదేశాన్ని ఒక తయారీ, సాంకేతిక అభివృద్ధి, అంతరిక్ష భాగస్వామ్యాలకు ఒక ప్రధాన కేంద్రంగా చూడాలని ఆయన కోరారు.

# ప్రభుత్వం 'అంకెల గారడీ'తో బిజీగా ఉంది

నిత్యావసరాల ధరల పెరుగుదల వేళ కేంద్రంలోని మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ద్రవ్యోల్బణం 'హై-వోల్టేజ్ షాక్' ఇప్పుడు పండుగల ఆనందాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందని విమర్శించింది. ప్రభుత్వం 'అంకెల గారడీ'తో బిజీగా ఉందని ఆరోపించింది. ఈ మేరకు కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీ జైరామ్ రమేశ్? వ్యాఖ్యానించారు. పండుగ షాపింగ్ సీజన్ ప్రారంభం కాకముందే పెరుగుతున్న ధరలు గృహ బడ్జెట్లపై భారం మోపాయని పేర్కొన్న ఒక మీడియా నివేదిక స్క్రీన్‌షాట్‌ను ఆయన ఎక్స్‌లో షేర్ చేశారు.

"ద్రవ్యోల్బణం 'హై వోల్టేజ్ షాక్' ఇప్పుడు పండుగల ఆనందాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. మోదీ ప్రభుత్వం ప్రతి వారం ద్రవ్యోల్బణంతో ప్రజల జేబులు కొడుతోంది. కేవలం మూడు వారాల్లోనే ఉల్లిపాయల ధరలు రెట్టింపు అయ్యాయి. చక్కెర ధర 25 శాతం పెరిగింది. కందిపప్పు, మినుములు, ఆవాలు, రిఫైన్?డ్ ఆయిల్ ధరలు కూడా పెరిగాయి. దీపావళికి ముందే బాదం, జీడిపప్పు, పిస్తా, ఎండుద్రాక్ష, వాల్‌నట్‌లు కూడా ఖరీదయ్యాయి. పాలు, చక్కెర ధరలు పెరగడంతో స్వీట్ల ధరలు కూడా నిరంతరం పెరుగుతున్నాయి. నెయ్యి, మసాలాల ధరలు కూడా పెరుగుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే వంటగది, పండుగలు ఖరీదైనవిగా మారాయి. గృహ బడ్జెట్ ఇబ్బందుల్లో పడింది. ప్రజల జేబులపై పడుతున్న ఈ భారం మోదీ ప్రభుత్వానికి కనిపించడం లేదు. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయకుండా, ప్రభుత్వం గణాంకాల గారడీతో దాని ప్రభావాన్ని దాచడంలో నిమగ్నమైంది. మోదీ గణాంకాల గారడీ ద్రవ్యోల్బణం ప్రభావాన్ని దాచలేరు. ప్రజలు ప్రతీదీ గమనిస్తున్నారు."

పెరుగుతున్న ధరల రూపంలో దేశానికి "హై వోల్టేజ్ షాక్" ఇస్తోందని కేంద్రంపై కాంగ్రెస్ ఇప్పటికే తీవ్ర విమర్శలు గుప్పించింది. అలాగే "అహంకారపూరిత" మోదీ ప్రభుత్వం "గణాంకాల గారడీ"తో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తోందని పేర్కొంది. ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో నమోదైన 7.8 శాతం జీడీపీ (+ఖూ) వృద్ధి రేటు "ఆర్థిక



పునరుజ్జీవనానికి సంకేతం" కాదని ఆ పార్టీ తెలిపింది.

### పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను వాయిదా జాప్యంపై కాంగ్రెస్ ఫైర్

మరోవైపు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను వాయిదా వేయడంలో జాప్యంపై కాంగ్రెస్ సోమవారం ప్రశ్నించింది. డీలిమిటేషన్ బిల్లులను ఆమోదించడానికే హోం మంత్రి అమిత్ షా సభలను వాయిదా వేయకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపించింది. కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీ జైరామ్ రమేశ్? ఈ మేరకు ఎక్స్? వేదికగా పోస్ట్ చేశారు. "పార్లమెంటును నిరవధికంగా వాయిదా వేసి నేటికి సరిగ్గా 25 రోజులు అయ్యింది. కానీ దానిని ఇంకా ప్రొరోగ్ చేయలేదు. సాధారణంగా నిరవధిక వాయిదా వేసిన 3-4 రోజుల తర్వాత ప్రొరోగేషన్ జరుగుతుంది. కానీ 2015 వర్షాకాల సమావేశాల్లో ఇది 28 రోజుల వ్యవధి ఉంది. లలిత్ మోదీ అంశంపై ఆందోళనలతో ఆ సమావేశాలు దాదాపు పూర్తిగా రద్దయ్యాయి. కానీ మోదీ ప్రభుత్వం జీఎస్టీ బిల్లులను బలవంతంగా ఆమోదింపజేయాలనే ఆశతో సమావేశాలను కొనసాగించింది. దానికి రాజ్యసభలో మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం, కానీ అది వారికి లేదు. చివరికి, మోదీ ప్రభుత్వం ప్రతిపక్షాలతో మరింత అర్థవంతంగా సంప్రదించి చాలా ఆలస్యంగా బిల్లులను ఆమోదించాల్సి వచ్చింది. డీలిమిటేషన్ బిల్లులను ఆమోదం కోసం హోం మంత్రి ఇప్పటికీ లోక్‌సభలో తనకు ఇష్టమైన మూడింట రెండు వంతుల మెజారిటీ కోసం నానా తంటాలు పడుతుండటంతో 2026 వర్షాకాల సమావేశాలు వెంటిలేటర్‌పై ఉన్నాయి. ఆయన బెదిరింపులు, భయపెట్టే రాజకీయాలు హద్దులు దాటాయన్న వాస్తవాన్ని అంగీకరించడానికి ఇంకెంత కాలం పడుతుంది?" అని జైరాం రమేశ్? అన్నారు.

## మోదీ సభ కోసం తొలిసారి 'బుక్ మైషో'లో రిజిస్ట్రేషన్



భారత ప్రధాని నరేంద్ర మోదీ సెప్టెంబర్ 8న గుజరాత్‌లోని వడోదరలో పాల్గొననున్న కార్యక్రమానికి ప్రజల నుంచి ముందుగానే విశేష స్పందన వచ్చింది. తొలిసారిగా ప్రధాని కార్యక్రమానికి 'బుక్ మైషో' ద్వారా ఉచిత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేపట్టారు. దీంతో రిజిస్ట్రేషన్ ప్రారంభమైన గంటలోపే అందుబాటులో ఉన్న సీట్లన్నీ బుక్ అయిపోయాయి. ఆ తర్వాత కూడా భారీ సంఖ్యలో ప్రజలు రిజిస్ట్రేషన్ కోసం ప్రయత్నించడంతో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారు. ఈ సీట్ల బుకింగ్ తీరు మోదీ కార్యక్రమం పట్ల ప్రజలకు ఉన్న అపారమైన ఉత్సాహాన్ని ప్రతిబింబిస్తోంది. నరేంద్ర మోదీ మంగళవారం వడోదరలో పర్యటించనున్నారు. నగరంలో రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు. కొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇంకొన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు. మోదీ ప్రోగ్రామ్ సీట్ల రిజిస్ట్రేషన్ కోసం తొలిసారి వడోదర మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) బుక్ మైషోను ఉపయోగించింది. దీంతో ప్రధాని సభకు భారీగా స్పందన రావడం గమనార్హం.

## 'నవంబర్ 30 కల్లా నివేదిక సమర్పించాల్సిందే'

**ఆరావళిపై కమిటీకి సుప్రీంకోర్టు డెడ్‌లైన్**

**ఆరు నెలల గడువు కోరిన హైపవర్ కమిటీ**

**నవంబర్ 30లోగా తుది నివేదిక ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశం**

**ఆలస్యం చేస్తే కమిటీని పూర్తిగా పునర్వ్యవస్థీకరిస్తామని హెచ్చరిక**




ఆరావళి పర్వత శ్రేణి పరిధి, నిర్వచనం, పరిరక్షణకు సంబంధించిన తుది నివేదికపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. నివేదిక సమర్పించేందుకు మరో ఆరు నెలల గడువు కావాలని హైపవర్ కమిటీ చేసిన విజ్ఞప్తిని తిరస్కరించింది. నవంబర్ 30లోగా తుది నివేదికను సమర్పించాలని డెడ్‌లైన్ విధించింది. గడువులోగా నివేదిక ఇవ్వడంలో విఫలమైతే మొత్తం కమిటీని రద్దు చేసి కొత్త కమిటీ ఏర్పాటు చేస్తామని హెచ్చరించింది. ఆరావళి పర్వత శ్రేణి నిర్వచనం, దాని పరిధి, పర్యావరణ పరిరక్షణ, ముఖ్యంగా మైనింగ్ కార్యకలాపాల నియంత్రణకు సంబంధించి సుప్రీంకోర్టు కొన్ని నెలల క్రితం కమిటీని ఏర్పాటు చేసింది. ఆరావళి ప్రాంతాన్ని ఏ విధంగా గుర్తించాలి? ఏ ప్రాంతాలను రక్షణ పరిధిలోకి తీసుకురావాలి? మైనింగ్‌పై ఎలాంటి నియంత్రణలు ఉండాలి? అనే అంశాలపై కమిటీ ప్రస్తుతం అధ్యయనం చేస్తోంది. తుది నివేదిక సమర్పించేందుకు కమిటీకి గతంలో ఇచ్చిన గడువు ఆగస్టు 31తో ముగిసింది. అయితే ఆ అంశంపై సమగ్రంగా, భవిష్యత్తులో కూడా సమర్థించగలిగే విధంగా నివేదిక సిద్ధం చేయాలంటే మరింత సమయం అవసరమని కమిటీ పేర్కొంది. అందులో భాగంగా మరో ఆరు నెలల గడువు ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరింది. అంటే వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. అయితే ఆ అభ్యర్థనపై అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చీ, వి. మోహనలతో కూడిన ధర్మాసనం సోమవారం ఆ వ్యవహారాన్ని విచారించింది. కమిటీ కోరిన ఆరు నెలల గడువును ఇవ్వడానికి నిరాకరించింది. ఆరావళి అంశాన్ని మరింత కాలం వాయిదా వేయడం సరికాదని స్పష్టం చేసింది.

### 'రాత్రింబవళ్లు పనిచేయండి'

కమిటీ అవసరమైతే రాత్రింబవళ్లు పనిచేసి నివేదిక సిద్ధం చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. నవంబర్ 30వ తేదీలోగా తుది నివేదికను సమర్పించాలని ఆదేశించారు. రెండు నెలల సమయంలో నివేదిక ఇవ్వలేకపోతే ప్రస్తుత కమిటీని పూర్తిగా రద్దు చేసి కొత్త కమిటీని ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. ఆరావళి అంశం ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవహారాన్ని ఇకపై పెండింగ్‌లో ఉంచలేమన్న సంకేతాన్ని కోర్టు ఇచ్చింది. విచారణ సందర్భంగా కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపించారు. ఇప్పటికే ఒక మధ్యంతర నివేదిక సిద్ధమైందని కోర్టుకు తెలిపారు. అయితే దీనిపై స్పందించిన ప్రధాన న్యాయమూర్తి, మధ్యంతర నివేదిక కాకుండా తుది నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. ఆరావళి ప్రాంతంలోని అన్ని వర్గాల అభిప్రాయాలను పూర్తిస్థాయిలో తెలుసుకోవాల్సి ఉందని వివరించారు. ముఖ్యంగా ప్రభావిత వర్గాలకు తగినంత సమయం ఇచ్చి వారి అభిప్రాయాలను నమోదు చేయాల్సిన అవసరం ఉందని, మరింత సమయం అవసరమవుతుందని కోర్టుకు చెప్పారు.

### 'గిరిజనుల అభిప్రాయాలు తీసుకోవాలి'

అయితే రాజస్థాన్, గుజరాత్‌లలోని గిరిజన సమాజాలతో పాటు ఆరావళి ప్రాంతానికి సంబంధించిన అన్ని వర్గాల అభిప్రాయాలను కమిటీ తీసుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. అవసరమైతే అత్యవసర అంశాలపై విడివిడిగా మధ్యంతర నివేదికలను కూడా సమర్పించవచ్చని తెలిపింది. తద్వారా అత్యవసరంగా పరిష్కరించాల్సిన అంశాలపై కోర్టు విడిగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేసింది. ఆరావళి పర్వత శ్రేణి నిర్వచనం, మైనింగ్ నియంత్రణపై గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో వివాదం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. 2025 నవంబర్ 20న అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆరావళి కొండలు, పర్వత శ్రేణికి ఎత్తు ఆధారిత నిర్వచనాన్ని ఆమోదించింది. స్థానిక భూభాగం నుంచి 100 మీటర్ల ఎత్తు ఉన్న భౌగోళిక ఆకృతులను ఆరావళి కొండలుగా పరిగణించాలని నిర్ణయించింది. అలాగే 500 మీటర్ల పరిధిలో ఉన్న రెండు లేదా అంతకంటే ఎక్కువ కొండలను ఆరావళి శ్రేణిగా పరిగణించేలా నిర్వచనం ఇచ్చింది. ఆ నిర్వచనంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. కొత్త ప్రమాణాల వల్ల ఆరావళి ప్రాంతంలో పెద్ద భాగం రక్షణ పరిధి నుంచి బయటపడే అవకాశం ఉందని పర్యావరణవేత్తలు, ఇతర వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. దీంతో మైనింగ్ కార్యకలాపాలు పెరిగే ప్రమాదం ఉందన్న విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు గత డిసెంబర్‌లో ఆ తీర్పును రద్దు చేసింది. పాత కమిటీ సిఫార్సులను అమలులో లేకుండా చేసింది. ఆరావళి పర్యావరణ వ్యవస్థపై సమగ్రంగా అధ్యయనం చేసి, శాస్త్రీయ ఆధారాలతో కొత్త నిర్వచనాన్ని సూచించేందుకు కొత్త కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ నివేదిక సమర్పించిన తర్వాత డిసెంబర్ 2న ఆ కేసును సుప్రీంకోర్టు మరోసారి విచారించనుంది.

# స్వర్ణభారత్ ట్రస్ట్ 25 ఏళ్లుగా సేవలు అందించడం అభినందనీయం

-మొదటిపేజీ తరువాయి

అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రసంగంలో భాగంగా అందరికీ వందనం అంటూ యోగి తెలుగులో మాట్లాడి సభికుల్లో ఉత్సాహం నింపారు. 'కరోనా మహమ్మారి వల్ల అనేకమంది తల్లిదండ్రులు చనిపోయారు. అనాథ పిల్లలకు యూపీలో అటల్ ఆవాస్ విద్యాలయ్‌లో ఉచిత విద్య. మా గురుకుల పాఠశాలల్లో వసతుల కల్పనకు వెంకయ్యనాయుడే స్ఫూర్తి. సాంకేతికత పరిజ్ఞానాన్ని సమర్థంగా వాడుకునే దేశమే ముందుకెళ్తోంది. ఎంత చదువుకుని, ఉన్నతస్థానానికి వెళ్లినా దేశం పట్ల భక్తి ఉండాలి, ఎక్కడికి వెళ్లినా నేషన్ ఫస్ట్ అనే భావన అందరిలో ఉండాలని' యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రులు నారాయణ, సత్యకుమార్?తోపాటు తదితరులు హాజరయ్యారు.

"స్వర్ణభారత్ ట్రస్ట్ 25 ఏళ్లుగా సేవలు అందించడం అభినందనీయం. సమాజసేవకు వెంకయ్యనాయుడు తీసుకున్న సంకల్పం గొప్పది. స్వర్ణభారత్ ట్రస్ట్‌లో విద్య తోపాటు నైపుణ్య శిక్షణనూ అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల యువత, మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఉత్తరాదికి, దక్షిణాదికి వారధిగా వెంకయ్యనాయుడు పని చేశారు. మన పల్లెలు జ్ఞానానికి, ఆర్థికాభివృద్ధికి మూలకేంద్రాలు. ఒకప్పుడు మన గ్రామాలన్నీ స్వయంపోషకాలుగా ఉండేవి. అందుకే గ్రామాలకు తరలండి అంటూ గాంధీజీ పిలుపునిచ్చారు. పేద పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పడం జాతి నిర్మాణానికి సాయం చేయడమే. ఎక్కడికి వెళ్లినా భారతీయులం అంటూ గర్వంగా చెప్పుకోవాలి. గ్రామీణ ఉత్పత్తులకు ప్రపంచస్థాయి మార్కెటింగ్ సదుపాయాలు ఉన్నాయి."



స్వర్ణభారత్ ట్రస్ట్ తనకు మానస పుత్రికని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చెప్పారు. తన పేరుపై ఉన్న ఆస్తులు ట్రస్ట్‌కే చెందుతాయని ప్రకటించారు. ప్రతిఒక్కరూ జీవితంలో కొంతభాగం సేవకు కేటాయించాలని పిలుపునిచ్చారు. ఒకప్పుడు ఉత్తర్‌ప్రదేశ్ దేశంలో చాలా వెనుకబడిన ప్రదేశంగా ఉండదేని గుర్తుచేశారు. యోగి ఆదిత్యనాథ్ పాలనలో ఉత్తర్‌ప్రదేశ్ ఉత్తమప్రదేశ్‌గా మారిందని ఆయన ప్రశంసించారు. గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ, ఉచిత విద్య, వైద్యం అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తోందని మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ తెలిపారు.

అంతకుముందు అక్షర విద్యాలయ ప్రాంగణంలోని హెలిప్యాడ్ వద్ద యోగి ఆదిత్యనాథ్‌కు ట్రస్ట్ నిర్వాహకులు, నేతలు స్వాగతం పలికారు. అనంతరం సోమా సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని ఆదిత్యనాథ్ సందర్శించి అక్కడ శిక్షణ పొందుతున్న యువతతో మాట్లాడారు. స్వర్ణభారత్ ట్రస్ట్‌లో యువతకు ఇస్తున్న సాంకేతిక శిక్షణ, నైపుణ్యాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల స్కేటింగ్ ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించారు. అక్షర విద్యాలయ నిర్వహణను యోగి ప్రశంసించారు.

### మాతృభూమికి సేవ కోసం

గ్రామీణ సాధికారత, వికాసమే లక్ష్యంగా, సేవే పరమావధిగా పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు మానస పుత్రికగా 2001లో ఆవిర్భవించింది. వెంకయ్యనాయుడు స్ఫూర్తితో ఆయన మిత్రులు 8 మంది మాతృభూమికి సేవ చేయాలన్న సంకల్పంతో దీనిని ప్రారంభించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలో నెలకొల్పిన ట్రస్ట్ సేవలు బహుముఖంగా విస్తరించాయి. విజయవాడ సమీపంలోని ఆత్కూరు, హైదరాబాద్‌లోని ముచ్చింతల్‌లోనూ స్వర్ణభారత్ ట్రస్ట్ శాఖలు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున శిక్షణ, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

రాజకీయ కార్యక్రమాలకు తావులేకుండా ప్రభుత్వాల నుంచి సాయం, నిధులు ఆశించకుండా, భావసారూప్యం, సేవాతత్పరత గల వ్యక్తులు, సంస్థల భాగస్వామ్యం, సహకారంతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ట్రస్ట్ ఛైర్మన్‌గా ఉన్నారు. ఈ పాతికేళ్లలో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన లక్షల మంది పేదలు, మహిళలు, రైతులు, గ్రామీణ యువత జీవితాల్లో వెలుగులు నింపింది. విద్యార్థులు, యువతకు నైపుణ్య శిక్షణ, గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధిలో శిక్షణ పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందించేందుకు కృషి చేయడం అనే లక్ష్యాలను త్రికరణ శుద్ధిగా ఆచరిస్తోంది.

# పాదయాత్రల కౌంటర్...

**విజయవాడ :** ఏపీ రాజకీయాలలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చూపిస్తున్న తెగువ మామూలుగా లేదు. ప్రభుత్వంలో కీలక వ్యక్తిగా కొనసాగుతూనే.. ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేని మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్లాన్లకు ఎక్కడికి అక్కడ చెక్ పెడుతున్నారు. తాజాగా జగన్ పాదయాత్ర చేస్తారని వైసిపి తెగ ప్రచారం చేస్తున్న నేపథ్యంలో.. దానికి ప్రారంభంలోనే లోకేష్ చెక్ పెట్టారు. 2027 లో వాస్తవానికి ఏపీలో ఎన్నికలు జరగవు. అయితే 2027 లోనే పాదయాత్ర చేస్తానని జగన్ ఇప్పటికే ప్రకటించినట్టు తెలుస్తోంది. సరిగ్గా 2017 నవంబర్ 6న ఆయన పాదయాత్ర చేశారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఏకంగా 151 సీట్లను గెలుచుకొని.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. ఈసారి కూడా అదే ఫార్ములా రిపీట్ అవుతుందని జగన్ భావిస్తున్నారు. ఒకరకంగా ఎన్నికలకు రెండు సంవత్సరాల ముందుగానే జగన్ పాదయాత్రకు ప్రణాళిక రూపొందించడం విశేషం. గతంలో ఎన్నికలకు ఏడాదిన్నరకు ముందుగానే పాదయాత్ర ఫిక్స్ చేస్తే.. ఈసారి దాన్ని రెండు సంవత్సరాలకు ముందుగానే పొడిగించారు. గతంలో జగన్ 3700 కిలోమీటర్ల దాకా పాదయాత్ర చేశారు. ఈసారి ఏకంగా 5000 కిలోమీటర్లను టార్గెట్ గా పెట్టుకున్నారు. ఈసారి పూర్తిగా గ్రామాల మీదుగా వైయస్ జగన్ పాదయాత్ర సాగుతుందని వార్తలు వస్తున్నాయి. ఎన్నికలకు రెండు సంవత్సరాలు ముందుగానే అంటే దాదాపు 730 రోజులు.. ఒకవేళ మధ్యలో జగన్ విశ్రాంతి తీసుకున్న సరే రోజుకు మూడు గ్రామాలను కవర్ చేయాలని వైసిపి నేతలు డిజైన్ చేసినట్టు తెలుస్తోంది. వైసిపికి గ్రామీణ ప్రాంతాలలో ఓటు బ్యాంకు ఉందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సంక్షేమ పథకాలు గ్రామీణ ప్రాంతాలలోనే అధికంగా అమలు చేసినట్టు వారు గుర్తు చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు.. ఇతర సమీకరణాలు తనకు అనుకూలంగా ఉంటాయని వైసీపీ నేతలు భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలలో ఉన్న వ్యతిరేకత తమకు అనుకూలంగా ఉంటుందని వైసీపీ నేతలు అంటున్నారు. అయితే ఇప్పుడు టిడిపి అంతకు మించిన ప్రణాళికతో ఉంది. కేవలం వైసీపీ మీద ఉన్న నెగిటివిటీని



మాత్రమే కాకుండా.. అమరావతి.. రాజధాని అభివృద్ధి.. మౌలిక సదుపాయాలు.. సాగునీటి ప్రాజెక్టులు వంటి వాటిని ప్రధానంగా ప్రచారం చేసుకుంటున్నది. మెరుగైన సంక్షేమం అందిస్తున్నామని ఇప్పటికే టిడిపి వివిధ వేదికలలో వైసిపి కి చెక్ పెట్టే విధంగా ప్రచారం చేస్తోంది. వైసీపీ ప్రణాళికలకు గట్టిగానే దెబ్బకొట్టే విధంగా అడుగులు వేస్తోంది. ఒకవేళ ఇప్పుడు టిడిపి ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమానికి ఎక్కువ ఇస్తామని వైసిపి చెబితే ప్రజల్లో కొత్త సానుకూలత వచ్చే అవకాశం ఉంది. అయితే కేవలం సంక్షేమ మాత్రమే కాకుండా.. అభివృద్ధి ఎజెండాను కూడా వైసిపి చూపించాల్సి ఉంటుంది. ఏపీ రాజధాని విషయంలో వైసిపికి ఇప్పటికి ఒక క్లారిటీ లేదు. గతంలో మూడు రాజధానులు అన్నారు. ఆ తర్వాత విశాఖపట్నం అన్నారు. ఇప్పుడేమో మావిగన్ అంటున్నారు. ఒకవేళ మావిగన్ గురించి వైసిపి ఇప్పటికంటే ఎక్కువ ప్రచారం చేసినప్పటికీ.. అప్పటికే అమరావతి మొదటి దశ పూర్తవుతుంది. అలాంటప్పుడు వైసిపి మావిగన్ గురించి డప్పు కొట్టి చెప్పిన ప్రయోజనం ఉండదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏపీలో సాగునీటి ప్రాజెక్టులను వరుసగా ప్రారంభించుకుంటూ వెళ్తోంది. అంతేకాదు, పోలవరం కూడా పూర్తి చేస్తామని చెబుతోంది. ఎన్నికల నాటికి కొన్ని కీలకమైన ప్రాజెక్టులు కూడా పూర్తవుతాయని కూటమి నేతలు అంటున్నారు. అలాంటప్పుడు జగన్ పాదయాత్ర చేస్తున్నప్పుడు ఎలాంటి విమర్శలు చేస్తారు.. క్రెడిట్ చోరీ అంటూ ఒకవేళ జగన్ విమర్శలు చేసినప్పటికీ ఉపయోగము ఉండదు. జగన్ చేస్తున్న పాదయాత్రకు కౌంటర్ గా.. ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేష్ కూడా పాదయాత్ర చేస్తారని.. జగన్ పర్యటించిన ప్రాంతాలకు దగ్గరగానే లోకేష్ పాదయాత్ర కూడా సాగుతుందని కూటమినేతలంటున్నారు. జగన్ కూటమి ప్రభుత్వం మీద చేసే ప్రతి విమర్శకు లోకేష్ గట్టిగా బదులు చెబుతారని.. దీనికి సంబంధించి గట్టిగానే బ్లూ ప్రింట్ రూపొందించారని సమాచారం. సాధారణంగా ప్రతిపక్షం పాదయాత్ర చేస్తూ ఉంటుంది. కానీ ఏపీలో వైసిపికి ప్రతిపక్ష హోదా లేదు. కానీ ఇక్కడ చిత్రంగా అధికార పక్షంలో ఉన్న టిడిపి పాదయాత్ర చేసేందుకు సిద్ధంగా ఉంది. ఈ ప్రకారం చూసుకుంటే 2027 లో ఏపీ రాజకీయాలలో పెను ప్రకంపనలు చెలరేగడం ఖాయం.

## వ్యవసాయ కూలి నుంచి లేడీ డాన్ వరకు..

**తిరుపతి :** చిన్న గదిలో ఉంటూ.. వ్యవసాయ కూలీగా జీవితం మొదలుపెట్టిన ఓ మహిళ మాజీ మంత్రి కీలక అనుచరుడి సాయంతో లేడీ డాన్‌గా ఎదిగింది. ఆమె మదలనపల్లెకు చెందిన కోనేటి సులోచన. స్థానికంగా 'లేడీ డాన్'గా చలామణి అవుతూ అనేక అక్రమాలకు పాల్పడింది. శనివారం కోనేటి సులోచన ఇంట్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మాజీ మంత్రి ముఖ్య అనుచరుడితో చేతులు కలిపి వందల కోట్ల విలువైన భూములను అక్రమంగా కాజేసిన వ్యవహారం వెలుగులోకి రావడంతో.. కోర్టు ఆదేశాలతో తనిఖీలు నిర్వహించారు. మదనపల్లె డీఎస్పీ బుచ్చిరాజు ఆధ్వర్యంలో సీఐలు మోహన్ కుమార్, రాజారెడ్డి, మహమ్మద్ రఫీలతో కూడిన మూడు టీమ్‌లు నిర్వహించాయి. సులోచన నివాసంతో పాటు ఆమె సోదరుడు శ్రీనివాసులు ఇంట్లో తనిఖీలు చేశారు. పోలీసులు తనిఖీల్లో 50 రకాల కీలక ఆస్తి డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకున్నారు. వీటిల్లో 15 ఫోర్జరీ సంతకాలు చేసి ఉంచిన పాత ఖాళీ బాండు పేపర్లు బయటపడ్డాయి. అప్పులు ఇచ్చినట్లు నమ్మించి, వారి నుంచి బలవంతంగా ఖాళీ బాండ్లపై సంతకాలు తీసుకుని ఆస్తులు లాక్కోవడానికి వీటిని ఉపయోగించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ పత్రాలను ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి పంపినట్లు డీఎస్పీ తెలిపారు. సులోచన పేరుపై బండకమ్మమిాదపల్లెలో రూ.60 కోట్ల విలువైన 502 చదరపు గజాల స్థలం, బిల్డింగ్, పొన్నూటిపాళ్యంలో 1.75 ఎకరాల భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఫోర్జరీ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజును ఉపయోగించి 10 కోట్ల విలువైన 47 సెంట్ల భూమిని ఆక్రమించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ భూమిని మాజీ మంత్రి భార్య పేరిట 2023 జూన్‌లో గిఫ్ట్‌డీడ్‌గా మార్చినట్లు గుర్తించారు. గతంలో కోట్ల విలువైన భూములను అక్రమంగా రాయించుకున్నారని బాధితులుచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో మదనపల్లె లేడీ డాన్ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. అయితే పోలీసుల తనిఖీలు చేస్తున్న క్రమంలో సులోచన ఇంట్లో లేదు. ఆమె విజయవాడలో ఉన్నట్లు గుర్తించారు. సులోచన ఇంట్లో స్వాధీనం చేసుకున్న పత్రాల వివరాలను ఇంట్లో ఉన్న ఆమె పిల్లలకు అందజేశారు. బాధితుడు మార్పు వెంకటేష్ నాయుడు ఇచ్చిన ఫిర్యాదుతో కోర్టు ఆదేశాలతో పోలీసులు తనిఖీలు నిర్వహించనట్లు సమాచారం. లేడీడాన్ సులోచనపై మదనపల్లె ఒకటో, రెండో పట్టణ, పోలీసు స్టేషన్లలో 14 క్రిమినల్ కేసులు, రౌడీషీట్ ఉండడం గమనార్హం.

## స్వదేశ్ దర్శన్ పేరుతో బుద్దిస్ట్ ఎక్స్ పీరియన్స్

**శ్రీకాకుళం :** స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల కింద మొత్తం రూ. 419.30 కోట్లతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. స్వదేశ్ దర్శన్ పథకంలో రూ. 152 కోట్లతో ఇప్పటికే అరకు గుహలు, సూర్యలంక బీచ్ అభివృద్ధి చేయడంతో పాటు నాగార్జునసాగర్ వద్ద బుద్దిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ కూడా నిర్మిస్తున్నారు. భవిష్యత్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రూ. 101.07 కోట్లతో అరకు కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధి చెందిన అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ పరిసరాలు, గన్నవరం మైస్ సెంటర్ ఏర్పాటు, నెల్లూరు జిల్లాలో వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రకృతి అందాలను బయట ప్రపంచానికి చూయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. టూరిస్ట్ ప్లేస్‌లుగా పేరొందిన కొన్ని ప్రదేశాలను మరింత అందంగా మార్చేందుకు భారీగా నిధులు వెచ్చిస్తున్నారు. స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల కింద మొత్తం రూ. 419.30 కోట్లతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల అభివృద్ధికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. అరకు, అరసవల్లి, గన్నవరం, వేదిగిరి ప్రాంతాల అభివృద్ధికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపిన టెండర్లకు కూడా ఆహ్వానించింది. స్వదేశ్ దర్శన్ పథకంలో రూ. 152 కోట్లతో ఇప్పటికే అరకు గుహలు, సూర్యలంక బీచ్ అభివృద్ధి చేయడంతో పాటు నాగార్జునసాగర్ వద్ద బుద్దిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ కూడా నిర్మిస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రూ. 101.07 కోట్లతో అరకు కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. కొత్తవలసలో ఐటీడీఏకు చెందిన 19.23 ఎకరాల స్థలంలో దీన్ని అభివృద్ధి చేయనున్నారు. గిరిజన సంస్కృతి, స్థానిక వంటకాలు, అరకు కాఫీ, చిరు ధాన్యాల ప్రత్యేకతలను పర్యాటకులకు పరిచయం చేయనున్నారు. శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధి చెందిన అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ పరిసరాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ. 107.94 కోట్లతో అరసవల్లి సన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. నాగావళి నది ఒడ్డున చారిత్రక డచ్ హెరిటేజ్ భవనాన్ని పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురానున్నారు. గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు కిలోమీటర్ దూరం సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో రూ. 176 కోట్లతో గన్నవరం మైస్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. నెల్లూరు జిల్లాలో వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని రూ. 34.29 కోట్లతో ప్రసాద్ పథకం కింద అభివృద్ధి చేయనున్నారు. వీటితో పాటు స్వదేశ్ దర్శన్ 2.0లో మరికొన్ని ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది.

## కార్యకర్తలే పార్టీకి బలం..

-మొదటిపేజీ తరువాయి

హెచ్చరించారు.

### విజన్-2047తో నియోజకవర్గాల అభివృద్ధి

స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌పై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విజన్‌కు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు తమ ఆలోచనలతో విలువ జోడించాలని (వాల్యూ ఎడిషన్) సూచించారు. "విజన్ ప్లాన్ అమలు చేస్తే అభివృద్ధి సాధ్యమవడమే కాదు, ఎన్నికల్లోనూ గెలుపు ఖాయం. పేద-ధనిక మధ్య అంతరాలు తగ్గించడమే ఈ విజన్ ప్రధాన లక్ష్యం. ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ, ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి చొప్పున కేటాయించాలని నిర్ణయించాం" అని తెలిపారు. కేంద్ర మంత్రులుగా ఉన్నవారు జాతీయ స్థాయిలో శాఖలను పర్యవేక్షిస్తున్న స్ఫూర్తితోనే తమ జిల్లాలను అభివృద్ధి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల్లో ఉన్నత విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఉన్నారని, వారంతా తమ అనుభవంతో విజన్ డాక్యుమెంట్లను అధ్యయనం చేసి, వినూత్నంగా ఆలోచించాలని కోరారు. "వందేళ్లలో జరిగే పనులను పదేళ్లలో పూర్తి చేసే టెక్నాలజీ ఇప్పుడు అందుబాటులో ఉంది. ప్రతి ఎమ్మెల్యే అకుంఠిత దీక్షతో పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు" అని చంద్రబాబు అన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు 28 కొత్త పాలసీలు తీసుకొచ్చినట్లు ఆయన గుర్తుచేశారు.

## తాగునీటి కష్టాలకు చెక్

తాగునీటి ఎద్దడి అధికంగా ఉన్న ప్రాంతాల్లో నీటి ప్రాజెక్టుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఏడాది చివరినాటికి పూర్తి చేయాల్సిన లక్ష్యాలను నెలలు, వారాల వారీగా విభజించుకుని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలన్నారు. తద్వారా పనుల్లో వేగం పెరిగి నిర్దేశిత గడువులోపు ప్రజలకు తాగునీటి సౌకర్యం అందుబాటులోకి వస్తుందని స్పష్టం చేశారు. జల్ జీవన్ మిషన్ - అమరజీవి జలధారల కింద రూ. 2,370 కోట్లతో చేపట్టిన 'చిత్తూరు మల్టీ విలేజ్ స్కీమ్' పనుల పురోగతిపై పవన్ సమీక్షించారు. ప్రాజెక్టు నిర్మాణం, పైప్‌లైన్ నిర్మాణం కోసం వివిధ శాఖల నుంచి పొందాల్సిన అనుమతులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని ప్రతి పల్లెకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని అధికారులు తెలుపుతున్నారు. కేంద్ర నిధులు ఉపయోగించుకుని జల్‌జీవన్‌మిషన్ ద్వారా ప్రతీ ఒక్కరి దాహార్తి తీర్చాలనే సంకల్పాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అమరజీవి జలధార రూపంలో ముందుకు తీసుకెళు న్నారు. అత్యంత నీటి ఎద్దడి కలిగిన ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అడుగులు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, 2024తో ముగిసిన జల్‌జీవన్‌మిషన్ గడువును 2028 వరకు పొడిగించారు. జల్‌జీవన్ మిషన్ 2.0 కింద దాదాపు రూ. 26,000 కోట్ల విలువ చేసే తాగునీటి ప్రాజెక్టులు ముందుకు తీసుకువెళ్తున్నారు.

అందులో మొదటి విడతగా రూ. 7,910 కోట్లతో 5 జిల్లాల పరిధిలో చేపట్టిన 5 మెగా వాటర్ గ్రిడ్ పథకాల్లో చిత్తూరు కూడా ఒకటి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజలకు శాశ్వత తాగునీటి భద్రత కల్పించేందుకు జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార నిధులతో రూ. 2,370 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిష్ఠాత్మక తాగునీటి సరఫరా పనులు చేపట్టినట్ల సంబంధిత అధికారులు వివరిస్తున్నారు. పవన్ కల్యాణ్ పర్యవేక్షణలో ప్రాజెక్టు పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గండికోట, వెలిగల్లు జలాశయాలను నీటి వనరులుగా వినియోగిస్తూ అమలవుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా 3 నియోజకవర్గాల పరిధిలోని 18 మండలాల్లో ఉన్న 3,163 ఆవాసాలకు స్వచ్ఛమైన తాగు నీరు అందించనున్నారు. సుమారు 25 లక్షల మంది ప్రజలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు.

### నాణ్యతా లోపాలు లేకుండా

చిత్తూరు మల్టీ విలేజ్ తాగునీటి పథకానికి సంబంధించి గండికోట వద్ద ఇంటేక్ వెల్ నిర్మాణం జరుగుతోంది. నాలుగు రా వాటర్ సంపులు నిర్మించాల్సి ఉండగా, మూడింటి పనులు వేగంగా సాగుతున్నాయి. గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణం, గుర్రంకొండ వద్ద 75 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో ఒక నీటి శుద్ధి కేంద్రం, వెలిగల్లు వద్ద 26 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో మరో నీటి శుద్ధి కేంద్రం నిర్మాణ దశలో ఉన్నాయి. ఇప్పటివరకు దాదాపు 130 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం కూడా పూర్తయ్యింది. 7 నీటి సంపులు, 5 ఓవర్‌హెడ్ ట్యాంకులు, 14 గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల పనులు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా చేపట్టాలని పవన్ కల్యాణ్ అధికారులకు సూచించారు.

## సైబర్ నేరాలపై పోలీసుల యుద్ధం

-మొదటిపేజీ తరువాయి




సమాచారాన్ని సేకరిస్తారు. డార్క్‌వెబ్ మార్కెట్ ప్లేస్‌లు, హ్యాకర్ గ్రూపులు, ఎన్‌క్రిప్టెడ్ చాట్‌లలో జరిగే డేటా విక్రయాలు, మాల్‌వేర్ డీల్స్‌ను పర్యవేక్షిస్తారు. ఐపీ చిరునామాలు, డొమైన్ నేమ్‌లు, మాల్‌వేర్ శాంపిల్స్, సిస్టమ్ లాగ్‌లను రికార్డు చేస్తారు. నేరగాళ్లు వాడిన టెక్నిక్స్, ప్యాటర్న్ గమనిస్తారు. దాడులు, నేరాలను ముందుగానే అంచనా వేసి హెచ్చరికలు జారీచేస్తారు.

### శాస్త్రీయ పద్ధతిలో ఆధారాల సేకరణ

సైబర్ నేరాల్లో వాడిన డిజిటల్ పరికరాల నుంచి సాక్ష్యాలు, ఆధారాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరిస్తారు. నేరగాళ్లు వాడిన కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, హార్డ్‌డిస్క్‌లు, పెన్‌డ్రైవ్‌ల్లోని డేటాను రికవరీ చేసి, భద్రపరుస్తారు విశ్లేషిస్తారు. ఆ ఆధారాలను న్యాయస్థానాల్లో సమర్పించేందుకు వీలుగా నివేదికలు రూపొందిస్తారు.

సొత్తు విత్ డ్రా చేసే వీల్లేకుండా హోల్డ్ : సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన సొత్తు ఏయే మ్యూల్ ఖాతాలకు, డిజిటల్ వాలెట్‌లకు, క్రిప్టో కరెన్సీకి మళ్లిందో సిబ్బంది ట్రాక్ చేస్తారు. ఆ సొత్తును నేరగాళ్లు తీసుకోకుండా వెంటనే ఖాతాలను స్తంభింపజేస్తారు. బాధితులు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదిస్తే సంబంధిత బ్యాంకులకు వెంటనే ఆటోమేటెడ్ సందేశాలు వెళ్లేలా చూస్తారు. దోచేసిన సొత్తును విత్ డ్రా చేసే వీల్లేకుండా హోల్డ్‌లో పెడతారు.

### ముందుగానే ముప్పు గుర్తింపు

రాష్ట్ర పరిధిలోని ప్రభుత్వ డిజిటల్ మౌలిక సదుపాయాలు, కీలక రంగాల నెట్‌వర్క్‌లపై సైబర్ దాడులు జరగక ముందే ముప్పు గుర్తిస్తారు. అనధికార లాగిన్ యత్నాలు, పరిమితికి మించి డేటా బదిలీ తదితర అనుమానాస్పద చర్యలను కృత్రిమ మేధతో పసిగడతారు. కొత్తగా వస్తున్న మాల్‌వేర్‌లు, వైరస్‌లు, అంతర్జాతీయ హ్యాకింగ్ గ్రూపుల వ్యూహాల సమాచారాన్ని సేకరించి సిస్టమ్‌లను నవీకరిస్తారు.

నేరపూరిత కార్యకలాపాల కోసం సైబర్ గస్తీ : నేరపూరిత డిజిటల్ కార్యకలాపాలను గుర్తించేందుకు సైబర్ గస్తీ నిర్వహిస్తారు. సామాజిక మాధ్యమాలు, వెబ్‌సైట్‌లలో చట్టవిరుద్ధ కార్యకలాపాలు, దేశభద్రతకు భంగం కలిగించే, హింసను ప్రేరేపించే, విద్వేషాలు రెచ్చగొట్టే సమాచారాన్ని పరిశీలిస్తారు. ఆన్‌లైన్ వేధింపులు, చైల్డ్ పోర్నోగ్రఫీ తదితరాలను ముందే గుర్తించి అడ్డుకుంటారు. ఫిషింగ్ లింక్‌లు, నకిలీ పెట్టుబడి యాప్‌లు, మోసపూరిత ప్రకటనలు, నకిలీ వెబ్‌సైట్‌లను ఎప్పటికప్పుడు బ్లాక్ చేస్తారు. డార్క్‌నెట్‌లో జరిగే అక్రమ ఆయుధాల విక్రయం, మత్తు పదార్థాల సరఫరా, హ్యాకింగ్ టూల్స్, దొంగిలించిన డేటా విక్రయాలపై కన్నేసి ఉంచుతారు.

దర్యాప్తు అధికారులకు సంక్లిష్ట సాంకేతిక విషయాల్లో తక్షణ సాయం, విశ్లేషణ, నైపుణ్యాన్ని అందించేందుకు టెక్నికల్ అసిస్టెన్స్ యూనిట్ సైబర్ గార్డ్‌లో అంతర్భాగంగా ఉంటుంది. సైబర్ నేరాలను అరికట్టడానికి, బాధితుల ఆర్థికనష్టాన్ని తగ్గించటానికి, దర్యాప్తు సంస్థలు, బ్యాంకులు, ఫైనాన్షియల్ గేట్‌వేలు, టెలికాం సంస్థలతో కలిసి పోలీసులు ఇక్కడి నుంచి పనిచేస్తారు.

# వినాయక చవితి మండపాలకు పోలీస్ అనుమతులు తప్పనిసరి.

**నిబంధనలు ఉల్లంఘిస్తే ఉత్సవ కమిటీలపై కేసులు.**

**అనంతగిరి ఎస్సై కే శంకర్రావు.**



**అనంతగిరి,సెప్టెంబర్ 7 ( మీ వార్త )** వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసే మండపాలకు నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ అనుమతులు పొందాలని అనంతగిరి ఎస్సై శంకర్ రావు సూచించారు.ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలకు సంబంధించి పలు సూచనలు,నిబంధనలను వెల్లడించారు.అనంతగిరి మండల పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామాల్లో ఏర్పాటు చేసే వినాయక చవితి మండపాల నిర్వాహకులు వైబ్సైట్లో ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.మండపం ఏర్పాటు చేసే ప్రదేశం,విగ్రహం ఎత్తు,ఎన్ని రోజులపాటు పూజలు నిర్వహించేది,నిమజ్జనం తేదీ తదితర వివరాలతో పాటు ఉత్సవ కమిటీకి చెందిన ఐదుగురు సభ్యుల పేర్లు,వారి ఫోన్ నంబర్లను నమోదు చేయాలన్నారు.వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా డీజేలు వినియోగించడం,నృత్యాలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని ఎస్సై స్పష్టం చేశారు. నిమజ్జనం ఊరేగింపును సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటలలోపు పూర్తి చేయాలని సూచించారు.వేడుకల సమయంలో ఇతరులకు ఇబ్బంది కలిగించడం,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం వంటి ఘటనలకు ఉత్సవ కమిటీ నిర్వాహకులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.వేడుకల సందర్భంగా గొడవలు,అవాంఛనీయ ఘటనలు లేదా ఇతర ప్రమాదాలు చోటు చేసుకుంటే సంబంధిత ఉత్సవ కమిటీ సభ్యులపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై శంకర్ రావు ఆదేశించారు,వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో,ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుక నిర్వాహకులు పోలీసులకు సహకరించాలలన్నారు.

# గిరిజన ప్రాంతాల్లో నిబంధనల ఉల్లంఘన..

**అనుమతులు లేకుండానే అక్రమ కట్టడాల జోరు!**

**1/70,వాల్టా చట్టాలకు తూట్లు పొడుస్తున్న గిరిజనేతరులు.**

**విధులకు డుమ్మా కొడుతూ రియల్ఎస్టేట్ వ్యాపారంలో ప్రభుత్వ ఉద్యోగి.**

**అనంతగిరి,సెప్టెంబర్ 7 ( మీ వార్త )** అల్లూరి జిల్లా అనంతగిరి మండలం టోకూరు పంచాయతీ ముల్యగూడ గ్రామ సమీపంలో గిరిజన చట్టాలను బహిరంగంగా ఉల్లంఘిస్తూ అక్రమ కట్టడాలు అడ్డగోలుగా సాగుతున్నాయి. ఎటువంటి ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా,కనీసం స్థానిక గ్రామ పంచాయితీ అనుమతి కూడా తీసుకోకుండా కొందరు గిరిజనేతరులు ఇక్కడ యథేచ్ఛగా నిర్మాణ పనులు చేపడుతుండటం స్థానికంగా కలకలం రేపుతోంది.

**బినామీల పేర్లతో ల్యాండ్ మాఫియా.**

షెడ్యూల్డ్ ప్రాంతాలలో గిరిజనేతరులు భూములు కొనడానికి వీల్లేదనే కఠినమైన '1/70 చట్టం' అమలులో ఉన్నప్పటికీ,ల్యాండ్ మాఫియా బినామీల పేర్లను వాడుకుంటూ ఇక్కడి భూములను హస్తగతం చేసుకుంటోంది.ప్రకృతి వనరులను,భూగర్భ జలాలను రక్షించాల్సిన 'వాల్టా చట్టాన్ని' సైతం పూర్తిగా పక్కనబెట్టి కొండలు,మైదాన ప్రాంతాలను ఆక్రమించి ఈ అక్రమ కట్టడాలు జరిపిస్తున్నారు.ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల హక్కులను కాపాడాల్సిన చట్టాలు అధికారుల కళ్ల ముందే నిర్వీర్యమవుతున్నాయని గిరిజన సంఘాలు అవేదన వ్యక్తం చేస్తున్నాయి.

**అధికారి అండదండలు.. విధులకు గైర్హా జరు.**

ఈ అక్రమ వ్యవహారాల వెనుక స్థానిక ప్రభుత్వ అధికారి హస్తం ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.అనంతగిరి మండల కేంద్రంలోని పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్గా విధులు నిర్వహిస్తున్న 'మూర్తి' అనే ఉద్యోగి ఈ అక్రమ,నాయకులు నిర్మాణాల్లో కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం.ఆయన వారంలో కేవలం సోమవారం రోజు మాత్రమే కార్యాలయానికి వస్తూ,మిగతా రోజుల్లో కనీసం విధులకు హాజరుకావడం లేదని స్థానిక రైతులు,పలు సంఘాల మండిపడుతున్నారు.ప్రభుత్వ జీతం తీసుకుంటూ విధులను గాలికొదిలేసి,వారం పొడుగునా ఈ అక్రమ రియల్ ఎస్టేట్ వ్యాపారాలను,కట్టడాలను పర్యవేక్షించడానికే ప్రాధాన్యత ఇస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

**చర్యలు తీసుకోవాలని డిమాండ్**

గిరిజన చట్టాలను అపహాస్యం చేస్తూ,పంచాయతీ అనుమతులు లేకుండా సాగుతున్న ఈ అక్రమ



కట్టడాలను వెంటనే నిలిపివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.అలాగే విధులకు క్రమంగా గైర్హాజరవుతూ అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న సదరు ప్రభుత్వ ఉద్యోగిపై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపి,శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘాలు,గిరిజన హక్కుల పోరాట నమితులు గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి.

# తీజ్ మహోత్సవాన్ని జాతీయ పండుగగా గౌరవించాలి





**టీ నర్సాపురం సెప్టెంబర్ 7. (మీ వార్త విలేకరి ):** బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో కృష్ణాపురం గ్రామంలో తొమ్మిది రోజుల దీక్షను ముగించుకుని తీజ్ ఊరేగింపు, నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. సంఘం జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ బంజారా కన్యల కలలను పండించే పండుగ, శాస్త్రీయ వ్యవసాయ పండుగ తీజ్ అని అన్నారు. కష్టాలకు, బాధలను ఎదురోడ్డి ఆత్మస్థైర్యంతో జీవితాన్ని విజయవంతం చేసుకునేలా చిన్నప్పటి నుండే ఆడపిల్లలకు శిక్షణ ఇచ్చే ఉద్దేశ్యంతో ఈ తీజ్ పండుగను బంజారాలు జరుపుకుంటారని అన్నారు. బంజారా సంఘం సీనియర్ నాయకులు బాధావతు లక్ష్మణ స్వామి మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి గ్రామాలు పాడిపంటలతో ధన,ధాన్యాలతో వర్ధిల్లాలి అని తొమ్మిది రోజుల పాటు నవ ధాన్యాలకు ఆడపిల్లలతో దీక్ష చేయించి పండుగ తీజ్ అని అన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి భూక్యా వేణు గోపాల్ మాట్లాడుతూ గోర్ బంజారాలు ప్రపంచంలోనే చాలా విశిష్టమైన సంస్కృతిని కలిగినవారని, భారత దేశమంతా తీజ్ పండుగను జరుపుకుంటారని, ఈ తీజ్ ను ప్రభుత్వం జాతీయ పండుగగా గుర్తించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో అడపా నాగరాజు, సంఘం అధ్యక్షులు పర్యావరణం జిల్లా కన్వీనర్ జరభల కృష్ణ ప్రసాద్, యువజన నాయకులు భూక్యా సురేష్, కార్మిక నాయకుడు జరభల రామకృష్ణ మొదలగువారు ప్రసంగించారు. సంఘం అధ్యక్షులు జరభల చందా నాయక్ తీజ్ దీక్ష శిబిరం వద్ద పూజ కార్యక్రమాలు నిర్వహించగా, కోలాటం, తీన్మార్ డప్పులతో, బంజారా నృత్యాలతో ఊరంతా తీజ్ బుట్టలను 5 కిలోమీటర్లు ఊరేగించి రాళ్ళ చెరువులో నిమజ్జనం చేశారు. తీజ్ దీక్ష చేసిన పాతిక మంది బంజారా కన్యలకు సంఘ నాయకుల చేతుల మీదుగా నూతన వస్త్రాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో జరభల యుగంధర్, ధరావతు జ్యోతి కిషోర్, భూక్యా భిగనాధం,వడిత్యా పార్వతి, భూక్యా ధనలక్ష్మి, జరభల అరుణ, బోడా రవి, బోడా చంద్రరావు, బాణావతు కృష్ణ నాయక్,పాలేటి సత్తిబాబు, బై గాని చందు,సవరం సుబ్బారావు, జబ్బా రాంబాబు. కోలగాని చిన్న వెంకటేశ్వరరావు, ముత్తు తదితరులు పాల్గొన్నారు

## కానూరు పి ఏ సి ఎస్ నందు నిర్వహించిన మహాజన సభ లో చెక్కులు పంపిణీ

**కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ గోపు సత్యనారాయణ**

మచిలీపట్నం సెప్టెంబర్ 7(మీ వార్త ప్రతినిధి) మచిలీపట్నం కానూరు పి ఏ సి ఎస్ నందు నిర్వహించిన మహాజన సభ మీటింగుకు ముఖ్య అతిథిగా కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ గోపు సత్యనారాయణ పాల్గొన్నారు.ఈ సమావేశంలో రైతులకి 3% వడ్డీ రాయితీ గోపు సత్యనారాయణ చేతులమీదుగా చెక్కు ద్వారా =o. 5,36,780/- రూపాయలు 459 మంది రైతుల ఖాతాలకు జమ చేయడం జరిగినది ,సంఘం యొక్క నూతన భవన నిర్మాణం గురించి, 2025-26 సంవత్సర లాభనష్టాలు మరియు వాయిదా మీరిన బకాయిలు వాటికి చట్ట పరంగా తీసుకోవలసిన లీగల్ చర్యలు గురించి చర్చించటం జరిగినది. ఈ కార్యక్రమం లో రైతులకు కౌలు కార్డులు అందచేయటం జరిగినది, ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ గారైన గోపు ప్రతాప్ నరేష్ కుమార్ మాట్లాడుతూ తాను ఛార్జ్ తీసుకున్న 13 నెలల కాలంలో 50 మంది రైతులకి రూ.2,50,00000/- రెండు కోట్ల యాభై లక్షల రూపాయల కొత్త రుణాలు మంజూరు చెయ్యడం జరిగినది అని మరియు ఓవర్ డ్యూ అయిన బాకీలు 16 మంది దగ్గర నుంచి రూ. 6,70,000/- రూపాయలు కట్టించడం జరిగినది అని తెలియజేసారు,డైరెక్టర్స్ అయిన దివి మహేష్ , చెక్కా నాగరాజు మరియు సొసైటీ సెక్రెటరీ అడపా శ్రీనివాసరావు మరియు వి ఆర్ ఓ చలమలశెట్టి దాసు , వి ఏ ఏ కె.స్వామి మరియు రైతులు పీత రఘురాములు గారు గణపాబతుల చూడామణిగారు జొన్నల నాగమల్లేశ్వరరావు
గమిడి రంగారావు
సిద్ధి రెడ్డి పాండురంగారావు
గోపు వెంకటరమణ
చిటికనేటి సీతారామయ్య
గోపు కనకపెద్ది రాజులు
కాళ్లపల్లి లక్ష్మీనరసింహారావు
మొటమర్రి రామకృష్ణ
మాగంటి నాగ శివ
గణపబత్తుల నాగ పాము
గమిడి రాజు
గణపబత్తుల కనకయ్య గోపు
చంద్రరావు
బొలి శెట్టి నాగరాజు
జల్లూరి శ్రీనివాసరావు
కమ్మకట్ట అశోక్
దివి ధనలక్ష్మి
బోట్ల రాజేష్
ఈమన ప్రకాశ రావు
చిమ్మట ఓంకారం
గణపబత్తుల రామకోటయ్య
దివి కృష్ణ వీర పెద్దిరాజులు ఇతర సంఘ సబ్యులు 150 మంది వరకు పాల్గొన్నారు.



## సెప్టెంబర్ 10న వైసీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం.

**అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పిలుపు.**



**అనంతగిరి/అరకులోయ,సెప్టెంబర్ 7 (మీ వార్త )** స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతే లక్ష్యంగా ఈనెల 10వ తేదీన (గురువారం) నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) ప్రతినిధుల సమావేశం నిర్వహించనున్నట్లు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు.అరకు క్యాంప్ కార్యాలయంలో గురువారం ఉదయం 10:00 గంటలకు ఈ సమావేశం ప్రారంభం కానుంది.ముఖ్య అజెండాగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం,గ్రామ స్థాయిలో బూత్ కమిటీలను మరింత బలోపేతం చేయడం మరియు పార్టీ ప్రతినిధులకు గుర్తింపు కార్డుల పంపిణీ వంటి కీలక అంశాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించనున్నారు.అరకు నియోజకవర్గ పరిధిలోని రాష్ట్ర,జిల్లా స్థాయి వైసీపీ నాయకులు,అనుబంధ విభాగాల అధ్యక్షులు,కమిటీ ప్రతినిధులు,మండల పార్టీ అధ్యక్షులు,జడ్పీటీసీలు,ఎంపీపీలు,వైస్ ఎంపీపీలు,ఎంపీటీసీలు,మాజీ సర్పంచులు మరియు పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు అందరూ ఈ సమావేశానికి సకాలంలో తప్పనిసరిగా హాజరుకావాలని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పిలుపునిచ్చారు.క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ఈ సమావేశం ఎంతో కీలకమైనందున ప్రజాప్రతినిధులు,శ్రేణులు బాధ్యతగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## బుట్టాయిగూడెం శివాలయంలో ఘనంగా అన్నదానం



**ఎటపాక, సెప్టెంబర్ 7 మీ వార్త ప్రతినిధి:** పవిత్ర సోమవారం సందర్భంగా ఎటపాక మండలం బుట్టాయిగూడెం గ్రామంలోని శ్రీ శివాలయం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు గొట్టుపుల్ల కృష్ణమాచార్యులు వేదమంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పవిత్ర సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కూనవరం మండలం పరిధిలోని టేకులబోరు గ్రామానికి చెందిన వేముల సుబ్బారావు--కుమారి దంపతులు అన్నప్రసాద వితరణకు సహకరించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు పెద్ద సంఖ్యలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ భక్తులు, దాతల సహకారంతో ప్రతి సోమవారం ఆలయంలో నిరంతరంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆధ్యాత్మిక సేవాభావంతో అన్నదానానికి ముందుకు వచ్చిన టేకులబోరు గ్రామానికి చెందిన వేముల సుబ్బారావు--కుమారి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కుసుమరాజు సురేష్, కిలారు రాజశేఖర్, అరవ కామేశ్వరరావు, సరియం బుజ్జి, పులుసు కోటేశ్వరరావుతో పాటు స్థానిక గ్రామస్తులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సోమవారం కావడంతో ఆలయ ప్రాంగణమంతా శివనామస్మరణతో మారుమోగి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## పెద్దతుమ్మిడికి మంచినీటి వసతికి రూ.57 లక్షలు



**బంటుమిల్లి, సెప్టెంబరు 7(మీ వార్త ప్రతినిధి)** బంటుమిల్లి మండలం పెద్దతుమ్మిడి గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కారానికి జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.57 లక్షలు కేటాయించిన జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఉప్పాల హారిక గారికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో తాగునీటి అవసరాలను గుర్తించి నిధులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నిధులతో మంచినీటి వసతులు మెరుగుపడి గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తొలగనున్నాయని తెలిపారు. గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న జడ్పీ చైర్పర్సన్కు గ్రామస్తులు ధన్యవాదాలు తెలియజేశారు.

## వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్ సి సెల్ ప్రధాన కార్యదర్శి గా కారుమంచి కామేశ్వరరావు

**శుభాకాంక్షలు తెలిపి సత్కరించిన గ్రామస్తులు**



**గూడూరు సెప్టెంబర్ 7(మీ వార్త ప్రతినిధి)** వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్ సి సెల్ ప్రధాన కార్యదర్శి గా నియమించిన కారుమంచి కామేశ్వరరావు ని కలిసి తరకటూరు గ్రామానికి చెందిన గ్రామస్తులు పూలమాలతో శాలువాలతో సన్మానం చేయడం జరిగింది.గుర్జేపల్లి గ్రామానికి చెందిన గ్రామస్తులు పూలమాలతో శాలువాలతో సన్మానం చేయడం జరిగింది. శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి కి,పెడన ఇంచార్జ్ ఉప్పాల రాముకి, జిల్లా అధ్యక్షులు పేర్ని నాని కిహృదయపూర్వక ధన్యవాదాలు..వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్ సి సెల్ ప్రధాన కార్యదర్శి గా నియమించిన కారుమంచి కామేశ్వరరావు ని కలిసి శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారికి, పెడన ఇంచార్జ్ ఉప్పాల రాము గారికి, జిల్లా అధ్యక్షులు పేర్ని నాని గారికి ధన్యవాదాలు తెలిపారు.

# దళితవాడల దేవాలయాల పరిరక్షణకు వి హెచ్ పి శ్రీకారం

**జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన వి హెచ్ పి ప్రతినిధి బృందం**



**మచిలీపట్నం, సెప్టెంబర్ 7(మీ వార్త ప్రతినిధి)** దళితవాడలు (ఎస్ సి/ఎస్ టి పేటలు)లో శిథిలావస్థకు చేరుకున్న హిందూ దేవాలయాల పరిరక్షణ, పునరుద్ధరణతో పాటు నిత్య పూజలు, ధూపదీప నైవేద్యాలకు అవసరమైన ప్రభుత్వ సహకారం అందించాలని కోరుతూ విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధి బృందం సోమవారం ఉదయం 11:30 గంటలకు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీ నవీన్ గారిని కలిసి వినతిపత్రం సమర్పించింది.

ఈ సందర్భంగా శ్రీ గురువిందపల్లి విజయబాబు, శ్రీ దూళిపాల రాము, శ్రీ వర్రె రాజశేఖర్, శ్రీ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, శ్రీ శ్రీధర్ నిమ్మగడ్డ తదితరులు జాయింట్ కలెక్టర్‌ను కలిసి ఎస్ సి/ఎస్ టి పేటల్లోని దేవాలయాల దుస్థితిని వివరించారు. సరైన నిర్వహణ, మౌలిక సదుపాయాలు లేక అనేక ఆలయాలు శిథిలావస్థకు చేరుకోవడంతో నిత్య పూజలు, దీపారాధనలు, ధూపదీప నైవేద్యాలు నిర్వహించేందుకు భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దేవాలయాలు కేవలం ప్రార్థనా స్థలాలు మాత్రమే కాకుండా గ్రామీణ సమాజానికి ఆధ్యాత్మిక, సాంస్కృతిక మరియు సామాజిక ఐక్యతకు కేంద్రాలుగా ఉన్నాయని వి హెచ్ పి ప్రతినిధులు పేర్కొన్నారు. ముఖ్యంగా ఎస్ సి/ఎస్ టి పేటల్లోని దేవాలయాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, వాటి అభివృద్ధికి తగిన చర్యలు చేపట్టాలని కోరారు.వి హెచ్ పి ప్రతినిధుల వినతిని స్వీకరించిన జాయింట్ కలెక్టర్ శ్రీ నవీన్ సంబంధిత దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌ను పిలిపించి, సమస్యపై అక్కడికక్కడే చర్చించారు.ఈ సందర్భంగా ఎస్ సి/ఎస్ టి పేటల్లో ఉన్న దేవాలయాలను గుర్తించి, ప్రతి మండలంలో రెండు దేవాలయాలను ఎంపిక చేసి, వాటి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసి దేవాదాయశాఖ పరిధిలోకి తీసుకువస్తే, ఆయా దేవాలయాలకు ధూపదీప నైవేద్యాల నిర్వహణకు అవసరమైన నిధులను మంజూరు చేసే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.జాయింట్ కలెక్టర్ స్పందనపై వి హెచ్ పిప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, జిల్లాలోని ఎస్ సి/ఎస్ టి పేటల్లో ఉన్న దేవాలయాలను సమగ్రంగా గుర్తించి, అర్హత కలిగిన ఆలయాలను దశలవారీగా దేవాదాయశాఖ పరిధిలోకి తీసుకువచ్చి, వాటికి అవసరమైన నిధులు మరియు మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, దళితవాడల దేవాలయాల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రతినిధి బృందాన్ని వి హెచ్ పి జిల్లా అధ్యక్షులు డా. బురగడ్డ శ్రీనాథ్ మరియు జిల్లా ప్రభారి శ్రీ పి వి ఎస్ నాయుడు అభినందించారు. సమస్యపై సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో వెంటనే చర్చించినందుకు జాయింట్ కలెక్టర్ శ్రీ నవీన్ గారికి వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.దేవాలయాల పరిరక్షణ అనేది కేవలం నిర్మాణాల పరిరక్షణ మాత్రమే కాదని, ధార్మిక సంప్రదాయాలు, గ్రామీణ ఆధ్యాత్మిక జీవనం మరియు సామాజిక సమరసతను పరిరక్షించే బాధ్యత అని వి హెచ్ పి నాయకులు పేర్కొన్నారు.

దేవాలయ పరిరక్షణ -- ధర్మ పరిరక్షణ -- సామాజిక సమరసత ,జై శ్రీరామ్!

# పేటియం కుక్కల్లారా మెగా డి ఎస్ స్సి పై విష ప్రచారం మానండి.

**కృత్తివెన్ను టీడీపీ సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య ఫైర్**

**కృత్తివెన్ను సెప్టెంబర్ 7(మీ వార్త ప్రతినిధి)** పెటియం కుక్కల్లారా మెగా డి ఎస్ స్సి పై విష ప్రచారం చేసే బదులు మీ అన్న అధికారంలో ఉన్న 5 ఏళ్ళు ఎన్ని మెగా డి ఎస్ స్సి లు వదిలాడు.......



కృత్తివెన్ను టీడీపీ సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య మెగా డి ఎస్ స్సి ఉద్యోగాలపై వైసీపీ పెయిడ్ మీడియా, బులుగు మీడియా ఛాన్నాళ్ళు చేస్తున్న అబద్ధపు వార్తలు పై కృత్తివెన్ను మండల టీడీపీ సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య ఆదివారం మీడియా ద్వారా గొడ్డలి పార్టీ కుట్రలపై తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా అయన మీడియాతో మాట్లాడుతూ మెగా డి ఎస్ స్సి కీ, ఏ పి పి ఎస్ సి పరీక్షలకు తేడా అర్థం కానీ సన్నాసుల మాటలు విని 5 రూపాయలు ముష్టి కోసం పెటియం కుక్కలు, నెలకు 3 లక్షల ముష్టి కోసం పెటియం ఛానల్స్ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పై మాట్లాడటం పూర్తిగా వాళ్ళ దిగజారుడు తనానికి నిదర్శనం అని, 5 ఏళ్ళు అధికారంలో ఉండి జగన్ రెడ్డి ఎన్ని మెగా డి ఎస్ స్సి ఉద్యోగాలు యిచ్చాడు అని పిన్నెంటి రత్తయ్య బులుగు పార్టీ వాళ్ళను ప్రశ్నించారు. ఏం ఎల్ ఏ గా జీతం తీసుకుంటూ, పులివెందుల ప్రజలకు అందుబాటులో ఉండని వాడిమీద ఫోకస్ చెయ్యకుండా, కష్టపడి ఉద్యోగాలు సాధించిన గురువులను వేదిస్తున్న గంజాయి బ్యాచ్ ఆగడాలకు త్వరలోనే చరమగీతం పడతామని పిన్నెంటి రత్తయ్య అన్నారు. జగన్ రెడ్డికి దమ్ముంటే అసెంబ్లీ కీ వచ్చి మెగా డి ఎస్ స్సి పై చర్చకు రావాలి అని అదే మా నాయకుడు నారా లోకేష్ యిచ్చిన పిలుపుకు పారిపోయి శికండి లాంటి మీడియా వ్యవస్థలను, పెటియం కుక్కలను అడ్డు పెట్టుకుని అబద్దాలు వల్లిస్తూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ని జగన్ రెడ్డి పక్కదారి పట్టించాలని చూస్తున్నాడని కృత్తివెన్ను మండల టీడీపీ సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య అన్నారు....

# శ్రీ వినాయక విగ్రహం,శివలింగ ప్రతిష్ఠతో ఏలూరులో ఆధ్యాత్మిక

**శోభ: ప్రభుత్వ విప్ బొలిశెట్టి**

**అధినేత పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ప్రార్థించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్**

**తాడేపల్లిగూడెంఏలూరు సెప్టెంబర్ 7 (మీ వార్త ప్రతినిధి)** ఏలూరు నగరం 19వ డివిజన్, ఎన్టీఆర్ కాలనీ కాశీ కాలవ గట్టులో సోమవారం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి విగ్రహం, శ్రీ శివలింగ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. స్వామి వార్ల విగ్రహాల ప్రతిష్టతో ఏలూరు నగరం మరింత ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతాదని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు.ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎమ్మెల్యే బొలిశెట్టి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,హిందూ ధర్మ పరిరక్షణకు దేవాలయాల నిర్మాణం,ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ఆలయ నిర్మాణానికి కృషి చేసిన కమిటీ సభ్యులు మిథున్,రెడ్డి అప్పలనాయుడు తదితర పెద్దలను అభినందించారు. ఇటువంటి కార్యక్రమాల



ద్వారా ప్రజల్లో మంచి మార్పు వస్తుందని, హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో బయటకు రావాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీలకు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, ప్రజలకు మంచి పాలన అందాలని, రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ బాగుండాలని ప్రార్థించానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# వ్యక్తి నుండి అక్రమ మద్యం సీసాలు స్వాధీనం

**కేసు నమోదు**

**చింతలపూడి, సెప్టెంబర్ 7 ( మీ వార్త ప్రతినిధి )** జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అధికారులు ఆదేశాలు మేరకు చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ అధికారులు మరియు సిబ్బంది కలిసి మండల పరిధిలోని కంచనగూడెం గ్రామంలో ఎక్సైజ్ నేరములు కొరకు దాడులు నిర్వహించగా మాదాసి నాగరాజు అను వ్యక్తి వద్ద నుండి (06) డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు స్వాధీనం చేసి, ఆ వ్యక్తి పై కేసు నమోదు చేశారు. మండలం లోని పాత సారా కేసులో ముద్దాయి అయిన మాదాసి నాగరాజు అను వ్యక్తిను 129 బి ఎన్ ఎస్ ఎస్ చట్టం ప్రకారం మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ తాహసిల్దార్ ఎదురు హాజరుపరచగా సదరు వ్యక్తి ని సత్ప్రవర్తనతో మెలగాలని బైండోవర్ బాండ్ విధించారు. చింతలపూడి మండలం లో గల పలు మద్యం దుకాణాలలో మరియు రెస్టారెంట్ మరియు బార్ ను ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సురక్ష యాప్ ద్వారా మద్యం అమ్మకాలు జరపాలని తగు సూచనలు జారీ చేశారు. చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ ఎస్ ఐ అబ్దుల్ ఖలీల్ , జె.జగ్గారావు మరియు సిబ్బంది పాల్గొన్నారని ఎక్సైజ్ సి ఐ పి.అశోక్ తెలిపారు!




# గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ...

**పుల్లల చెరువు. సెప్టెంబర్ 7( మీ వార్త)** మండలంలోని మురికిమల్ల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వసతి గృహాన్ని సందర్శించి, విద్యార్థులతో ప్రత్యేకంగా ావేశమయ్యారు.విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న వసతులు, సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా వసతి గృహంలో మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? నాణ్యత ఎలా ఉంది? అని విద్యార్థులను ప్రశ్నించారు. అన్ని సౌకర్యాలు తమకు సక్రమంగా అందుతున్నాయని, మెనూ ప్రకారం భోజనం కూడా అందిస్తున్నారని విద్యార్థులు తెలిపారు.విద్యార్థుల సమాధానాలపై చైర్మన్ ప్రతాప్‌రెడ్డి సంతృప్తి, హర్షం వ్యక్తం చేశారు. అనంతరం



ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ.. నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఈ పాఠశాలలో 200 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసించడం గొప్ప విషయమన్నారు. ఇక్కడ చదువుతున్న విద్యార్థులంతా నిరుపేద కుటుంబాలకు చెందిన వారని, వారికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.విద్యార్థుల



భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఉపాధ్యాయుల పనితీరుపై ఆయన అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో భాస్కర్‌రావు, ఇందిరాప్రసాద్, సివిల్ సప్లయ్స్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెడన జనసేన స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యునిగా పుల్లేటి దుర్గారావు

**సత్కరించిన జనసేన నాయకులు**



**పెడన సెప్టెంబర్ 7(మీ వార్త ప్రతినిధి)** పెడన జనసేన స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యునిగా నియామకమైన పుల్లేటి దుర్గారావు ని ఘనంగా సన్మానించిన పెడన టౌన్ జనసేన నాయకులు జనసేన పార్టీ తరపున పెడన నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ తరపున స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సమన్వయ కమిటీ సభ్యునిగా నియామకమైన పుల్లేటి దుర్గారావు గారిని నిన్న పెడన టౌన్ జనసేన నాయకులు ఘనంగా సన్మానించారు.పెడన నియోజకవర్గంలో జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం నిస్వార్థంగా పని చేస్తు, జనసేన అభివృద్దే ధ్యేయంగా అందరితో కలిసి పనిచేసే పుల్లేటి దుర్గారావు గారికి ఈ బాధ్యత ఇవ్వడం సంతోషంగా ఉందని జనసేన నాయకులు కొనియాడారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వరుదు రామకృష్ణ , కూనపరెడ్డి రంగయ్య , వుచా జనార్దనరావు , మట్టా నాని , చిరుగురి కొండయ్య , టౌన్ మైనారిటీ నాయకులు షఫీ , వరుదు రాము మరియు తదితర జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.


# తాగునీటి బోరును పునరుద్ధరించాలి

**ఎంపీడీవోకు ఎస్సీ కాలనీ యువకుల వినతి**

**పుల్లలచెరువు, సెప్టెంబర్ 7( మీ వార్త)** పుల్లలచెరువు గ్రామ పంచాయతీ పరిధిలో నిరుపయోగంగా ఉన్న పంచాయతీ తాగునీటి బోరును పునరుద్ధరించి ఎస్సీ కాలనీ ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎస్సీ కాలనీకి చెందిన యువకులు సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.

స్థానికుల వివరాల ప్రకారం.. 2007 సంవత్సరంలో అప్పటి సర్పంచ్ శ్రీమతి లింగంగుంట్ల నాగమ్మ ఆధ్వర్యంలో రామానాయుడు చెరువు పక్కన ఉన్న అలుగు వద్ద పంచాయతీ నిధులతో తాగునీటి బోరు ఏర్పాటు చేసి, పైపుల ద్వారా ఎస్సీ కాలనీతో పాటు గ్రామంలోని ప్రజలకు తాగునీరు అందించేలా చర్యలు చేపట్టారు. ఈ బోరు సుమారు 16 సంవత్సరాల పాటు ప్రజలకు తాగునీటిని అందిస్తూ ఎంతో ఉపయోగకరంగా ఉందని వారు తెలిపారు. అయితే ప్రస్తుతం సరైన నిర్వహణ లేకపోవడంతో బోరు చుట్టూ పెద్ద ఎత్తున చెట్లు, పొదలు పెరిగి నిరుపయోగంగా మారిందని యువకులు తెలిపారు. పంచాయతీ ఆధ్వర్యంలో బోరు వినియోగంలో లేకపోవడంతో, బోరు పక్కనే ఉన్న పొలం వారు దానిని మరమ్మతు చేయించుకుని తమ అవసరాలకు వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బోరు పంచాయతీ ఆస్తి కాదా, ప్రస్తుతం ఎవరు వినియోగిస్తున్నారు, వారికి అధికారిక అనుమతి ఉందా అనే విషయాలను అధికారులు పరిశీలించాలని వారు కోరారు.

ప్రస్తుతం వర్షాలు సరిగా లేకపోవడంతో తాగునీటి



సమస్య తీవ్రంగా ఉందని, ముఖ్యంగా ఎస్సీ కాలనీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పంచాయతీ బోరును తక్షణమే పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టి తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీడీవోను కోరారు.

అలాగే బోరు చుట్టూ పెరిగిన చెట్లు, పొదలను తొలగించి ప్రదేశాన్ని శుభ్రం చేయించాలని, పంచాయతీ ఆస్తిని అనుమతి లేకుండా ఎవరైనా వినియోగిస్తున్నట్లయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

ఎస్సీ కాలనీ ప్రజల తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని యువకులు విజ్ఞప్తి చేశారు.

# పాశర్లపూడి లంక డోర్ టు డోర్ కార్యక్రమంలో విజయవంతంగా పూర్తి చేసిన టిడిపి

**మామిడికుదురు సెప్టెంబర్ 07( మీ వార్త విలేఖరి రవి).**

తెలుగుదేశం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తూ చేపట్టిన డోర్ టు డోర్ కార్యక్రమంలో పాశర్లపూడి లంక యూనిట్ 3 .9,10,11 బూత్ లను విజయ వతంగా పూర్తి చేశారు . ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బోనం నాగేశ్వరరావు,గ్రామ శాఖ కుడుపూడి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి బోర్సు చంటి, మాజీ ఎంపీటీసీలు కోలా సత్తిబాబు, పొలమూరి సత్యనారాయణ, సొసైటీ మాజీ చైర్మన్ కోలా సత్యనారాయణ, మార్కెట్ యాడ్ డైరెక్టర్ పితాని వెంకటేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ కుడుపూడి వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి పెదమల్లు దిలీప్ ,చేగోండి అన్నవరం,గుత్తుల ప్రసాద్మ, దొమ్మేటి జగదీష్ , వటపల్లి నరసింహమూర్తి,గుడుమేలంక కాశి, మంద వెంకటేశ్వరరావు,తొత్తరమూడి శీను,వాసంశెట్టి ప్రసాద్, సీనియర్ పార్టీ నాయకులు కార్యకర్తలు



# స్వర్ణ నియోజకవర్గం విజన్ ఉ యాక్షన్ ప్లాన్ యూనిట్ ప్రారంభించిన- ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

**పి గన్నవరం సెప్టెంబర్ 07 (మీ వార్త విలేఖరి రవి).** పి. గన్నవరం మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్వర్ణ నియోజకవర్గం విజన్ ఉ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాన్ని శాసనసభ్యులు శ్రీ గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు.దఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ గారి నాయకత్వంలో "స్వర్ణాంధ్ర ఏ 2047" లక్ష్య సాధనలో పి. గన్నవరం నియోజకవర్గాన్ని ముందంజలో నిలపడం విజన్ యూనిట్ ప్రధాన లక్ష్యమన్నారు. నియోజకవర్గంలోని అభివృద్ధి లోటుపాట్లను గుర్తించి, డేటా ఆధారంగా ప్రణాళికలు రూపొందించడం, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ, ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగడం ఈ యూనిట్ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. "డేటా ఆధారిత ప్రణాళిక -- సమర్థవంతమైన అమలు -- నిరంతర పర్యవేక్షణ -- ప్రజల భాగస్వామ్యం -- 15%కు పైగా స్థిరమైన వృద్ధి" అనే లక్ష్యంతో పి. గన్నవరం నియోజకవర్గాన్ని



స్వర్ణాంధ్ర ఏ 2047కు ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే శ్రీ గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, జాలం శ్రీనివాసరాజా,బోనం నాగేశ్వరరావు, పత్తిపాటి ఉమామహేశ్వరి,జిల్లా ఉపాధ్యక్షులు శిరిగిడి వెంకటేశ్వరరావు, మొల్లేటి శ్రీనివాస్, వాసంశెట్టి కుమార్, మార్కెట్ యార్డ్ చైర్ పెనుమల లక్ష్మి, గ్రామ శాఖలు, సొసైటీ చైర్మన్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# నిలువ నీడ లేదు..తాగేందుకు నీరు లేదు.

**అనంతగిరి గిరిజన రైతుల 'సంత'శాపం!**

**అధికారుల నిర్లక్ష్యంపై రైతులు,వ్యాపారస్తుల ఆగ్రహం.**

**అనంతగిరి,సెప్టెంబర్ 7 ( మీ వార్త )** పర్యాటక ప్రాంతంగా ఎంతగానో గుర్తింపు పొందిన అనంతగిరిలో ప్రతి సోమవారం జరిగే వారపు సంత కనీస సౌకర్యాలు లేక వెక్కిరిస్తోంది.అనంతగిరి, ఎగువ శోభ,బొర్రా వంటి పరిసర పంచాయతీల నుండి వందలాది మంది గిరిజన,సన్నకారు రైతులు తాము పండించిన పంటలను అమ్ముకోవడానికి ప్రతి వారం ఇక్కడికి వస్తుంటారు.అయితే,ఇక్కడికి వచ్చే రైతులు,వ్యాపారస్తులకు కనీస అవసరాలైన తాగునీరు,మరుగుదొడ్లు,ఎండ-వానల నుండి రక్షణ పొందేందుకు నిలువ నీడ (సంత షెడ్లు) లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.విచిత్రం ఏమిటంటే,ఈ సంతకు అతి సమీపంలోనే ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి.అధికారులు రోజూ ఇక్కడే తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నప్పటికీ,కళ్లెదుటే కనిపిస్తున్న సంత సమస్యలపై కనీసం దృష్టి సారించకపోవడం పట్ల స్థానికులు,రైతులు తీవ్ర విస్మయం వ్యక్తం చేస్తున్నారు.రోడ్లపైనే వ్యాపారాలు -- పొంచి ఉన్న ప్రమాదాలు:సంతలో వ్యాపారం చేసుకోవడానికి తగినంత



స్థలం లేకపోవడంతో, చిన్న మరియు సన్నకారు వ్యాపారస్తులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రధాన రహదారిపైనే దుకాణాలు పెట్టుకోవాల్సి వస్తోంది.నిత్యం పర్యాటకుల వాహనాలతో అత్యంత రద్దీగా ఉండే ఈ ప్రధాన రహదారిపై వ్యాపారాలు సాగించడం వల్ల,ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు,వ్యాపారస్తులు మరియు వినియోగదారులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.రైతులు,వ్యాపారస్తుల డిమాండ్:నిత్యం రద్దీగా ఉండే ఈ వారపు సంత సమస్యలపై ఇకనైనా



గ్రామపంచాయతీ ఉన్నతాధికారులు,ప్రజాప్రతినిధులు స్పందించాలి. తక్షణమే సంత ప్రాంగణంలో :మంచినీటి సదుపాయం కల్పించాలి.ప్రజా మరుగుదొడ్లను నిర్మించాలి.ఎండ,వానల నుండి రక్షణ కోసం శాశ్వత సంత షెడ్లను ఏర్పాటుచేయాలి.రహదారిపై కాకుండా వ్యాపారస్తులందరికీ సురక్షితమైన ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించి,ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి.తమ సమస్యలను పరిష్కరించి,గిరిజన రైతులకు,వ్యాపారస్తులకు న్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# తల్లాడలో సమైక్య భవనాలకు శంకుస్థాపన చేసిన సర్పంచ్ పెరిక నాగేశ్వరావు

**తల్లాడ మీ వార్త ప్రతినిధి.** 7.9.2026 తల్లాడ గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ సమైక్య భవనాల నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామీణ మహిళా సంఘాల కార్యకలాపాలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మొత్తం ఆరు సమైక్య భవనాల నిర్మాణానికి రూ.60 లక్షలు మంజూరు చేసింది. ఇందులో తల్లాడ పట్టణంలో నాలుగు, నారాయణపురం గ్రామంలో రెండు సమైక్య భవనాలు నిర్మించనున్నారు.ఈ సందర్భంగా భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులు సమావేశాలు నిర్వహించుకోవడంతో పాటు, స్వయం ఉపాధి, పొదుపు, రుణాలు తదితర కార్యక్రమాలను సమర్థవంతంగా కొనసాగించేందుకు సమైక్య భవనాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నిర్మించనున్న భవనాలను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత



గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.మహిళా సంఘాల బలోపేతానికి, గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు అవసరమైన సహకారం అందిస్తూ మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామని సర్పంచ్ పేర్కొన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ పెరిక నాగేశ్వరావు, ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మ రెడ్డి,ఎంపీడీఓ అంబటి శ్రీధర్ రాజు,ఏపీఎం రవి



కుమార్, ఏపీవో కోటయ్య, పంచాయతీ రాజ్ ఇంజనీర్ కార్తీక్,ఈ వో శ్రీ హరి క్రిష్ణ,నాయకులు రెడ్డెం వీరమోహన్ రెడ్డి, సరికొండ శ్రీనివాసరాజు, ముకర. ప్రసాద్,దొనేష్,పెరిక కిరణ్ కుమార్,షేక్ కమల్ మహిళా వార్డుమెంబెర్స్,శీలం. నాగమణి,గుంటుపల్లి కుమారి,అధికారులుప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

**పుల్లలచెరువు, సెప్టెంబర్ 7 ( మీ వార్త )** వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా, నిబంధనలకు లోబడి నిర్వహించుకోవాలని మార్కాపురం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు పుల్లలచెరువు ఎస్ఐ బి. సాంబశివరావు తెలిపారు. సెప్టెంబర్ 14 నుంచి జరిగే వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గణేష్ మండపాల ఏర్పాటుకు ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు.గణేష్ మండపాల ఏర్పాటుకు అవసరమైన పోలీస్, అగ్నిమాపక, పంచాయతీ, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖల అనుమతులను స్త్రుఖఅవంస్త్రబ్ఝిజ.అవ్ వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా పొందవచ్చని తెలిపారు. నిర్వాహకులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసి, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, కమిటీ సభ్యుల వివరాలు, విగ్రహం ఎత్తు, ప్రతిష్ఠ, నిమజ్జనం తదితర వివరాలను నమోదు చేయాలన్నారు. అనుమతి పొందిన అనంతరం క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రాన్ని మండపంలో ఉంచాలని సూచించారు. మండపాల వద్ద అగ్నిప్రమాదాలు జరగకుండా ఇసుక, నీరు, అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని, అలాగే విద్యుత్ వైరింగ్‌ను నిపుణులతో చేయించుకోవాలని తెలిపారు. స్పీకర్లను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలని, అధిక శబ్దం చేయరాదన్నారు.
విగ్రహాలు, మండపాలను రోడ్లపై ఏర్పాటు చేయరాదని, రాకపోకలకు ఇబ్బంది కలిగించేలా బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదన్నారు. ఊరేగింపులో పోలీసుల అనుమతి లేకుండా డీజేలు, అధిక శబ్దం చేసే వాయిద్యాలు వినియోగించరాదని స్పష్టం చేశారు. నిమజ్జనానికి కేటాయించిన సమయం, ప్రదేశం, మార్గాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణేశ విగ్రహాలను మాత్రమే ప్రతిష్ఠించాలని ఎస్ఐ కోరారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులు, నిర్ధారణ లేని వార్తలను నమ్మవద్దని, వాటిని ఇతరులకు పంపించవద్దని సూచించారు. ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు, నిర్వాహకులు, యువత, మత పెద్దలు, ప్రజాప్రతినిధులు పోలీసు శాఖకు సహకరించాలని ఎస్ఐ సాంబశివరావు కోరారు.



# ప్రధాని మోడీ 25 ఏళ్ల సేవా ప్రయాణం.

**రాబోయే ఎన్నికల్లో బిజెపి సత్తా చాటాలని పిలుపు.**





**అనంతగిరి,సెప్టెంబర్ 7 ( మీ వార్త )** నరేంద్ర మోడీ 25 ఏళ్ల ప్రజాసేవ పురస్కరించుకుని బిజెపి సమావేశం కార్యకర్తలతో ఘనంగా నిర్వహించారు.స్థానిక,సంస్థాగత ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలని పిలుపు ?ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా,భారత ప్రధానిగా సుదీర్ఘకాలంగా అందిస్తున్న 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని బిజెపి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.బిజెపి జిల్లా అధ్యక్షురాలు మట్టం శాంతి కుమారి,రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలరావు,జిల్లా ఇన్చార్జి పుట్ట గంగయ్య, కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు శెట్టి రాజుల నేతృత్వంలో ఈ వేడుకలు జరిగాయి.?ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు మట్టం శాంతి కుమారి మాట్లాడుతూ,నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని కొనియాడారు.బిజెపి శ్రేణులు మరింత పట్టుదలతో పనిచేసి,రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయాన్ని ఖాయం చేసి బిజెపి సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ?అంతేకాకుండా,సంస్థాగత ఎన్నికల్లోనూ పార్టీ జెండాను ఎగురవేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని నొక్కిచెప్పారు.బూత్ స్థాయి నుండి పార్టీ నిర్మాణాత్మక వ్యవస్థను బలోపేతం చేసి, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు ప్రధాని మోడీ సాధించిన విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లడం ద్వారా స్థానిక,సంస్థాగత ఎన్నికలన్నింటిలో బిజెపి స్పష్టమైన ఆధిపత్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు,మండల కమిటీలు గ్రామ కమిటీలు బూత్ కమిటీలు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సీతంపేటలో 78 మందికి రీ సర్వే పట్టాల పంపిణీ.



**అనంతగిరి,సెప్టెంబర్ 7 ( మీ వార్త )** అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలో గిరిజన రైతుల చిరకాల స్వప్నం సాకారమైంది సాగు భూములకు రీ సర్వే పట్టా హక్కు పత్రాలు లభించాయి.మండలంలో కాశీపట్నం పంచాయతీ పరిధిలోని సీతంపేట గ్రామంలో గిరిజన రైతులకు అటవీ హక్కుల మూడో విడత రీ సర్వే పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు.?గ్రామానికి చెందిన 78 మంది రైతులకు అధికారులు,ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా అందజేశారు.ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు అధికారికంగా పట్టాలు రావడంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేశారు.ఇకపై తమ భూములకు భద్రత లభించడంతో ప్రభుత్వ ఫలాలు కూడా నేరుగా అందుతాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు.?ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆర్ ఐ జగ్గయ్యమ్మ,స్థానిక ఎంపీటీసీ సన్యాసినాయుడు,మండల కో-ఆప్షన్ సభ్యుడు మదీనా,గిరిజన నాయకులు గేదె నంగనయ్య,అప్పలరాజు రైతులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలు ఖండించిన వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాపా సుధాకర్ .



**తల్లాడ మీ వార్త ప్రతినిధి.** 7.9.2026 దళిత స్పీకర్ ఉద్దేశించి ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత, అభ్యంతరకర వ్యాఖ్యలను వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కాపా సుధాకర్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు సంయమనం, బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. దళిత సమాజం ఆత్మగౌరాన్ని కించపరిచే విధంగా మాట్లాడడం ఏమాత్రం సమర్థనీయం కాదని ఇలాంటి వ్యాఖ్యలు సామాజిక సామరస్యానికి విఘాతం కలిగిస్తాయని కాపా సుధాకర్ గారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని దళిత సమాజానికి వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## పెదన యు పి హెచ్ సి పరిధిలో గాంధీ నగర్ సచివాలయం డి. టి. పాలెం ఫీవర్ సర్వే

**పెదన సెప్టెంబర్ 7 (మీ వార్త ప్రతినిధి)** ఈరోజు పెదన యు పి హెచ్ సి పరిధిలో గాంధీ నగర్ సచివాలయం లో దగ్గర. . డి. టి. పాలెం ఏరియా లో ఫీవర్ సర్వే, ఉయాంటీ లార్వా సర్వే, హెల్త్ ఎడ్డీకేషన్ చేసిన ఆరోగ్యసిబ్బంది. ఈ ప్రోగ్రాం లో హెల్త్ సూపర్ వైజర్ భట్రాజు సూరిబాబు గారు, హెల్త్ అసిస్టెంట్ సతీష్ బాబు గారు, ఏ ఎన్ ఎం వసంత కుమారి, రాజేశ్వరి , ఆశ వర్క ర్ షీ ల పాల్గొన్నారు.



# మహిళలు అభివృద్ధి చెందితేనే.. దేశం ముందుకు!

**నెల్లిపాకలో ఎటపాక పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం**

**మహిళా హక్కులు, బాలికల విద్య, ఆర్థిక స్వావలంబనపై చైతన్యం**

**ఎటపాక, సెప్టెంబర్ 7 (మీ వార్తా ప్రతినిధి):** మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించినప్పుడే సమాజం, దేశం అభివృద్ధి పథంలో మరింత వేగంగా ముందుకు సాగుతుందని ఎటపాక పోలీసులు పేర్కొన్నారు. మహిళలు, బాలికల్లో హక్కులు, విద్య, ఆర్థిక స్వావలంబనపై అవగాహన కల్పించేందుకు సోమవారం నెల్లిపాకలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చింతూరు సబ్ డివిజన్ పరిధిలో ఎటపాక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.కృష్ణ, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.కన్నప్పరాజు, ఎటపాక ఎస్ఐ జి.అప్పలరాజు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మహిళల హక్కులు, వారికి కల్పిస్తున్న చట్టపరమైన రక్షణ, బాలికల విద్య, ఆర్థిక స్వావలంబన, మహిళా సాధికారత తదితర అంశాలపై వివరించారు. బాలికలకు విద్య అందించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకునే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. మహిళలు ఇతరులపై ఆధారపడకుండా స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలు, చిన్నతరహా వ్యాపారాల ద్వారా ఆర్థికంగా ఎదగవచ్చని వివరించారు. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం లభించినప్పుడే కుటుంబం, సమాజంలో వారి నిర్ణయాధికారం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. అనంతరం మహిళా సాధికారతపై ప్రజల్లో మరింత చైతన్యం తీసుకువచ్చేందుకు నెల్లిపాకలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు,




మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహిళల అభ్యున్నతికి సంబంధించిన నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెల్లిపాక జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, పాఠశాల విద్యార్థులు, ముదిగొండ వినయ్ కుమార్ , గ్రామ ప్రజలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ సచివాలయ మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ అంటే రాజకీయ రచ్చబండ కాదు ప్రజాస్వామ్యానికి వేదిక

**దళితులంటే బిఆర్ఎస్ పార్టీకి అంత చిన్న చూపాదళితుల జోలికి వస్తే ఖబడ్దార్**

**ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలను ఖండించిన తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు కోడూరు రాము**

**తల్లాడ, మీ వార్త ప్రతినిధి** సెప్టెంబర్,7తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు కోడూరు రాము తీవ్రంగా స్పందించారు. దళిత నాయకుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని ఆయన అన్నారు,. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "దళితులంటే ఎమ్మెల్సీ తాతా మధుకు ఎందుకంత చులకన? పదవిలో ఉన్నామనే అహంకారంతో మాట్లాడటం సరికాదు. దళిత సమాజాన్ని అవమానించే విధంగా ఎవరైనా మాట్లాడితే ప్రజాస్వామ్య పద్ధతిలో తీవ్రంగా వ్యతిరేకిస్తాం" అని అన్నారు, దళితులు, బహుజనుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు పునరావృతం చేయవద్దని వారు సూచించారు. "పదవులు శాశ్వతం కాదు.. ప్రజల గౌరవం, రాజ్యాంగ విలువలే శాశ్వతం" అని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయకుండా, ప్రజా సమస్యలు మరియు అభివృద్ధి అంశాలపై మాట్లాడాలని ఆయన అన్నారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన గౌరవం కల్పించిందని ,ఆ రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. "దళిత నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే దళిత, బహుజన వర్గాలు ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనను తెలియజేస్తాయి. ఇకనైనా తాతా మధు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలి" అని రాము డిమాండ్ చేశారు. దళితుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే ఎలాంటి వ్యాఖ్యలను సహించబోమని, అవసరమైతే ప్రజాస్వామ్యబద్ధంగా సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్ట రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో



పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని రాము స్పష్టం చేశారు.

# గ్రామ పంచాయతీ కార్యదర్శులు పెన్షన్లు అప్లోడ్ విషయమై ప్రత్యేక శ్రద్ధ వహించాలి ఎంపిడిఓ జె.ఎన్.ధీక్షితులు

**ముమ్మిడివరం సెప్టెంబర్ 7 మీవార్త ప్రతినిధి**
ముమ్మిడివరం మండలం పంచాయితీ కార్యదర్శులకు కొత్తగా పెన్షన్లు అప్లోడ్ నిమిత్తము జిల్లా అధికారుల నుండి వచ్చిన సూచనలు మేరకు పలు సూచనలు జారీ చేయడమైనది.ముఖ్యంగా 1.సదరం సర్టిఫికెట్ టెంపరరీ సర్టిఫికెట్ అయినను అప్లోడ్ చేయవచ్చును
2.పిజిఆర్ఎస్ లో వచ్చిన దరఖాస్తు దారులందరికీ అప్లోడ్ చేయించవలెను
3 ఈకేవైసీ అవ్వని వారు ఎవరైనా ఉన్నాయెడల ఈకే వైసీ పూర్తిచేసి అప్లోడ్ చేయించవలెను
4 గౌరవ ఎమ్మెల్యేలకి దరఖాస్తు చేసుకొన్న దరఖాస్తుదారులందరికీ అప్లోడ్ చేయించవలెను
5.సచివాలయంలో ఎవరైనా దరఖాస్తు చేసుకొంటే వారికి కూడా అప్లోడ్ చేయించాలి .
6.గతంలో 2023,24 సంవత్సరంలో అప్లోడ్ చేసుకొన్న వారికి కూడా ఇప్పుడు అప్లోడ్ చేయవలసిన అవసరం ఉన్నది.పై సూచనలన్నీ గమనించి అందరూ గ్రామపంచాయతీ కార్యదర్శులు ఈ పెన్షన్ అప్లోడ్ విషయమై ప్రత్యేక శ్రద్ధ వహించి గ్రామ పెద్దల ద్వారా అర్హులందరినీ వివరములు సేకరించి సచివాలయ సిబ్బంది ద్వారా అప్లోడ్ చేయించవలసిందిగా కోరడమైనది. ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దల సహకారముతో అర్హులు అందరికీ పెన్షన్ కొరకు అప్లోడ్ చేయించ వలసిందిగా పత్రికా ముఖముగా ప్రజలందరినీ కోరడమైనదని ముమ్మిడివరం ఎంపీడీఓ జె.ఎన్.దీక్షితులు తెలియ జేశారు.

# ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడితే ఉపేక్షించేది లేదు: ఎమ్మెల్యే బొలిశెట్టి

**సీడబ్ల్యూసీ గోడౌన్లపై ఎమ్మెల్యే బొలిశెట్టి ఆకస్మిక తనిఖీలు**

**తాడేపల్లిగూడెం,సెప్టెంబర్ 7 (మీ వార్త ప్రతినిధి)** ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే ఉపేక్షించేది లేదని సిడబ్ల్యుసి గోడౌన్ అధికారులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశించారు.పట్టణ పరిధిలోని సీడబ్ల్యూసీ గోడౌన్లను ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్ల పరిసరాల్లో పేను కొరుకుడు పురుగుల సమస్యపై స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో ఆయన తనిఖీలు నిర్వహించారు. గోడౌన్లలో నిల్వ ఉన్న ధాన్యం, పరిసరాల పరిశుభ్రత, పురుగుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. పురుగుల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా గోడౌన్ అధికారుల తీరుపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడితే ఏమాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గోడౌన్ల నుంచి మళ్లీ పురుగులు బయటకు వస్తున్నట్లు గుర్తిస్తే కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేసి, అవసరమైతే గోడౌన్లను సీజ్ చేయిస్తానని స్పష్టం చేశారు. పరిశుభ్రత, పురుగుల నివారణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అధికారులు చేపట్టిన చర్యలను పరిశీలించేందుకు 10 రోజుల్లో మరోసారి ఆకస్మిక తనిఖీ చేస్తానని తెలిపారు. ప్రజల ఆరోగ్యం విషయంలో ఎలాంటి రాజీ ఉండదని,



సమస్య పరిష్కారం అయ్యేవరకు పర్యవేక్షణ కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# స్వర్ణ భారత్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

**25వ వార్షికోత్సవ వేడుకల్లో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్**

**నెల్లూరు ( మీ వార్త ప్రతినిధి ),** సెప్టెంబర్ 7: స్వర్ణ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. ట్రస్ట్ 25వ వార్షికోత్సవ వేడుకల్లో సోమవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నెల్లూరులోని సరస్వతి నగర్‌లో గల అక్షర విద్యాలయ పరిపాలన భవనానికి చేరుకున్న యోగి ఆదిత్యనాథ్‌కు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, స్వర్ణ భారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, హర్షవర్ధన్, మాజీ కేంద్ర మంత్రి, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రులు నారాయణ, సత్యకుమార్, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం యోగి ఆదిత్యనాథ్ సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్షర విద్యాలయ పరిపాలన భవనాన్ని సందర్శించిన ఆయన అక్కడ అందిస్తున్న విద్యా సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తదుపరి సోమా సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన యోగి ఆదిత్యనాథ్, యువతకు అందిస్తున్న సాంకేతిక శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. శిక్షణ పొందుతున్న యువతతో మాట్లాడి వారికి అందిస్తున్న అవకాశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా స్వర్ణ భారత్ ట్రస్ట్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను, అక్షర విద్యాలయం ద్వారా అందిస్తున్న విద్యా సేవలను యోగి ఆదిత్యనాథ్ అభినందించారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా ఉపాధి అవకాశాలకు బాటలు వేస్తున్న ట్రస్ట్ కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు.








# అటవీ ఉద్యాన రంగాల్లో సహకారం కోసం ఏపీఎస్ఎఫ్ఏ - ఉద్యాన వర్సిటీ మధ్య ఒప్పందం




**తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 7 (మీ వార్త ప్రతినిధి)** అటవీ, ఉద్యాన, అగ్రోఫారెస్ట్రీ రంగాల్లో సహకారం కోసం ఏపీ స్టేట్ ఫారెస్ట్ అకాడమీ (రాజమహేంద్రవరం), డా.వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఉపకులపతి డా.కట్టుపల్లి ధనుంజయరావు మాట్లాడుతూ, అడవుల పరిరక్షణతో పర్యావరణ సమతుల్యత, భూగర్భజలాల పెరుగుదల వంటి ప్రయోజనాలు ఉంటాయని, శాస్త్రీయ పరిజ్ఞానంతో విద్యార్థులు, అటవీ సిబ్బందికి ప్రయోజనం చేకూరేలా ఈ ఒప్పందం చేసుకున్నామన్నారు.ఏపీఎస్ఎఫ్ఏ డైరెక్టర్ బి.విజయ్ కుమార్ మాట్లాడుతూ, జూలైలో అకాడమీ స్నాతకోత్సవంలో ఉపకులపతి ఇచ్చిన సూచనలతో ఎంఓయూ రూపొందిందన్నారు.ఈ ఒప్పందం ద్వారా బీఎస్సీ ఫారెస్ట్రీ విద్యార్థులకు శిక్షణ, గిరిజన రైతులకు ఉద్యాన, అగ్రోఫారెస్ట్రీ సాంకేతిక పరిజ్ఞానం అందించడం, ఉమ్మడి పరిశోధనలు, వర్క్ షాపులు, క్షేత్ర శిక్షణలు నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా.ఎం.మాధవి, డీన్ డా.బి.ప్రసన్నకుమార్, డా.టి.పద్మలత తదితరులు పాల్గొన్నారు.అనంతరం బి విజయ్ కుమార్, అటవీ శాఖ సిబ్బంది విశ్వవిద్యాలయం కళాశాల ప్రాంగణం, కృషి విజ్ఞాన కేంద్రం లను సందర్శించారు. ఆయా సంస్థల్లోని విద్య, పరిశోధన,శిక్షణ,విస్తరణ కార్యక్రమాలు,ప్రయోగశాలలు, క్షేత్ర కార్యకలాపాలు, రైతులకు అందిస్తున్న సేవలను పరిశీలించి,శాస్త్రవేత్తలు, అధ్యాపకులు,సిబ్బందితో ఆయన చర్చించారు. భవిష్యత్తులో ఇరు సంస్థల మధ్య సంయుక్త శిక్షణ, పరిశోధన, విస్తరణ కార్యక్రమాల అమలుపై చర్చించారు.

# పట్టెంపాలెంలో 75 మందికి ఉచిత కళ్లజోళ్ల పంపిణీ



**తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 7 (మీ వార్త ప్రతినిధి)** గ్రామీణ పేద ప్రజలకు స్వచ్ఛంద సంస్థలు అందించే సేవలు అభినందనీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు అన్నారు. తాడేపల్లిగూడెం మండలం పట్టెంపాలెంలో సోమవారం 75 మందికి ఉచిత కళ్లజోళ్లు పంపిణీ చేశారు. గత నెల ఆగస్టు 26న పుచ్చలపల్లి సుందరయ్య సేవా సంస్థ వ్యవస్థాపకులు దాట్ల ఆంజనేయ రాజు, సినీ నిర్మాత ఎం.ఎస్. రాజు సౌజన్యంతో ఆత్మబంధువులం సేవా సంఘం ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు.అందులో గుర్తించిన 75 మందికి సైట్ కళ్లద్దాలను సోమవారం నాగేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు.పేదరికంలో ఉండే కంటి సమస్యలతో బాధపడుతూ సరైన వైద్యం చేయించుకోలేని వారికి ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో మేలు చేస్థాయన్నారు.నిస్వార్థ సేవలందిస్తున్న నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా కొనియాడారు.భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని ఆయన ఆకర్షించారు.ఈ కార్యక్రమంలో ఆత్మబంధువులం సేవా సంఘం ప్రతినిధి ఎన్.అచ్యుతరామయ్య,సంఘం ప్రతినిధులు,గ్రామ పెద్దలు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**ముమ్మిడివరం సెప్టెంబర్ 7 మీవార్త ప్రతినిధి** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండల ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు కోలా గంగాభవాని బాబ్జి వారి చేతుల మీదుగా సత్కారం జరిగింది.ఈ కార్యక్రమానికి రాయుడు ఉదయ భాస్కరరావు అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథులుగా శ్రీమతి కోలా గంగాభవాని హాజరై ఉత్తమ ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గారు జె.ఎన్.దీక్షితులు, జడ్పీటిసి కుడిపూడి శంకర్రావు, ప్రధానోపాధ్యాయులు గొర్రెల భాస్కరరావు,జి హరిబాబు విత్తనాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

# ఉపకులపతి డా.ధనుంజయరావుకు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు



**తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 7 (మీ వార్త ప్రతినిధి)** డా.వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డా.కట్టుపల్లి ధనుంజయరావు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డుకు ఎంపికయ్యారు.దేశంలో అత్యంత ప్రతిష్టాత్మక స్వతంత్ర పురస్కారాల్లో ఒకటైన ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేయనున్నట్లు స్కోచ్ సంస్థ ప్రకటించింది.వర్సిటీ పరిధిలోని వొనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) మెట్ట ప్రాంత రైతులకు ఉద్యాన పంటల సాగులో అందించిన శాస్త్రీయ సహకారం, సాంకేతిక పరిజ్ఞానం, రైతుల జీవనోపాధి మెరుగుదలకు చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది.ఈ అవార్డు ప్రదానోత్సవం సెప్టెంబర్ 26న న్యూఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్లో జరిగే 109వ స్కోచ్ సమ్మిట్లో నిర్వహించనున్నారు.జాతీయ స్థాయిలో లభించిన ఈ గుర్తింపు వర్సిటీకి గర్వకారణమని, సమర్థవంతమైన నాయకత్వం అందిస్తున్న ఉపకులపతిని అధికారులు, శాస్త్రవేత్తలు, సిబ్బంది అభినందించారు.

# ఐదుగురు రైతులకు రూ.30 లక్షల రుణాలు



**నక్కపల్లి, సెప్టెంబర్ 7 :( మీ వార్త ప్రతినిధి ) :**గొడిచెర్ల పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఐదుగురు రైతులకు సోమవారం రూ.30 లక్షల ఎస్టీఆర్ రుణాలను అందజేశారు. ఎకరానికి రూ.6 లక్షల చొప్పున రుణ సదుపాయం కల్పించినట్లు పీఏసీఎస్ చైర్మన్ దార్ల కృష్ణ తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా సొసైటీ ద్వారా రుణ సదుపాయాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు.

## సేవా సంకల్ప్ అభియాన్‌ను విజయవంతం చేయాలి

మండల సమావేశం లో బేబీ రాణి, గనిశెట్టి



**అమలాపురం, మీ వార్త ప్రతినిధి**, సెప్టెంబర్, 7 అయినవిల్లి మండలం ముక్తేశ్వరం బీజేపీ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు యనమదల వెంకటరమణ అధ్యక్షతన మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆకుమర్తి బేబీ రాణి, జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి సేవా కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. రక్తదాన శిబిరాలు, ఆరోగ్య సేవలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు, మొక్కలు నాటడం, ప్రజా అవగాహన కార్యక్రమాలు తదితర సేవా కార్యక్రమాలను నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని నాయకులు తెలిపారు. ప్రధాని మోదీ సేవా, సుపరిపాలన, అభివృద్ధి లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ అభియాన్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. మండల అధ్యక్షులు యనమదల వెంకటరమణ మాట్లాడుతూ.. అయినవిల్లి మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తల భాగస్వామ్యంతో 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి కార్యకర్త ప్రజా సేవలో భాగస్వామి కావాలని, కార్యక్రమాల విజయానికి సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కుడుపూడి చంద్రశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి సరెళ్ళ దాసు, మండల కార్యదర్శి నిడదవోలు నాగమణి, ఓబీసీ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి ముసిని సత్యనారాయణ, యువ మోర్చా మండల అధ్యక్షులు గుర్రాల వీర కృష్ణ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పితృ వియోగం లో ఉన్న తోటి డ్రైవర్ కు పరామర్శ..



**అమలాపురం, మీ వార్త ప్రతినిధి,సెప్టెంబర్ 7** ఇటీవల అనారోగ్యం కారణంగా తన తండ్రి నీ కోల్పోయి బాధలో ఉన్నా అల్లవరం గ్రామానికి చెందిన షేక్ జానీ ను అమలాపురం రథసారథి యూనియన్ డ్రైవర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వాసంశెట్టి సత్యానందం ఆధ్వర్యం లో కమిటీ సభ్యులు పరామర్శించి వివరాలు తెలుసుకుని వారి మృతి పట్ల సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ దంగేటి దుర్గా ప్రసాద్, సెక్రటరీ దుర్గారావు మంద, సభ్యులు కొంబత్తుల గాంధీ (వాసు), బొంతు శివ మరియు తదితరులు పాల్గొన్నారు..

## స్పీకర్‌కు ఎమ్మెల్సీ మధు బేషరతుగా క్షమాపణ చెప్పాలి

**కరీంనగర్ :** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగ ఎమ్మెల్సీ తాతా మధు, కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు.అనంతరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్ల రంగు టీ షర్టు, వాటిపై అసభ్యకరంగా రాసి ఉండటం వల్లలో పోలీసులు వారిని అసెంబ్లీలోకి వెళ్లకుండా గేటు వద్ద అటకాయించారని, ఈ క్రమంలో పోలీసులను, స్పీకర్ ను ఎమ్మెల్సీ మధు ధూషణలకు దిగారని, అతడి సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా వెంటనే స్పీకర్ కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పిఎస్‌ఏ చైర్మన్ ఒగ్గు దామోదర్, , మాజీ మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్, పార్టీ నాయకులు జెట్టి రమేష్, బైరా సంతోష్, గుర్రాల బాల్ నరసింహారెడ్డి, గాజ శ్రీనివాస్, తిరుపతి, గండికోట సురేష్, జెల్ల ప్రభాకర్,, మాజీ సర్పంచ్ రావుల నరసయ్య,ఉప సర్పంచ్ మచ్చ కుమార్ , వార్డు సభ్యులు ఎలిగే సతీష్, బొనగం రమేష్, కుంట శ్రీనివాస్ యూత్ అధ్యక్షులు కర్రావుల సందీప్, బోనగిరి శ్రీనివాస్, శ్రీహరి, కుసుంబ శ్రీనివాస్, సోషల్ మీడియా కన్వీనర్ కుంట హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తుడుందెబ్బ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ. జాతీయ రహదారిపై రాస్తారోకో

**ములుగు :** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలకేంద్రంలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు.ఏటూరునాగారం బస్టాండ్ నుండి ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ఐటీడీఏ ఎదురుగా జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు.ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసులకు విద్యా, ఉద్యోగాల్లో తీవ్ర జాప్యం చేస్తున్నాయని ఆరోపించారు. షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసులకు ఉద్యోగాలు కల్పించాలని, ఏజెన్సీ డీఎస్సీ ద్వారా ఏజెన్సీ సర్టిఫికెట్ ఆధారంగా ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏటూరునాగారం ఐటీడిఏ పీవో కి అందజేశారు.1976 నుండి 50 ఏళ్లుగా రాజ్యాంగ సవరణ లేకుండా ఎస్టీ జాబితాలోకి వచ్చి లంబాడీలు రిజర్వేషన్లు

## డబ్బులు దొంగిలించిందనే అనుమానంతో కుమార్తె పై తండ్రి దాడి




**అయినవిల్లి, సెప్టెంబర్ 07 ( మీ వార్త విలేఖరి )** వెలవలపల్లి గ్రామానికి చెందిన 12 ఏళ్ల బాలికపై ఆమె తండ్రి డబ్బులు దొంగిలించిందనే అనుమానంతో కర్రతో తీవ్రంగా దాడి చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే, బాలిక తల్లి మరియు తండ్రి మధ్య కుటుంబ విభేదాల కారణంగా సుమారు రెండు సంవత్సరాల క్రితం విడిపోయారు. ముగ్గురు పిల్లలు ప్రస్తుతం తండ్రి సంరక్షణలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 2 న బాలిక తాతయ్య ఇటుకల లోడు ట్రాక్టర్‌పై వెలవలపల్లి గ్రామానికి వెళ్లిన సమయంలో బాలికను గాయాలతో గుర్తించారు. ఈ విషయాన్ని బాలిక తల్లి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ నాగ మానస దృష్టికి విషయం వెళ్లింది. దీంతో బాలికను మరియు ఆమె తల్లిని సంప్రదించి వివరాలు తెలుసుకున్నారు. బాలిక తెలిపిన వివరాల ప్రకారం ఆమె తండ్రి జేబులో నుంచి డబ్బులు కింద పడిపోవడంతో వాటిని తీసి తిరిగి తండ్రి జేబులో పెట్టే ప్రయత్నం చేసింది. అయితే బాలిక డబ్బులు దొంగిలించిందనే అనుమానంతో తండ్రి ఆమెపై కర్రతో తీవ్రంగా దాడి చేయడంతో చేతులు, చెంపలపై గాయాలైనట్లు వెల్లడైంది. బాలిక భద్రత, సంరక్షణ మరియు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని, బాలల సంక్షేమ కమిటీ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుల ఆదేశాల మేరకు బాలికకు తాత్కాలిక రక్షణ మరియు వసతి నిమిత్తం వన్ స్టాప్ సెంటర్‌లో ఆశ్రయం కల్పించారు.

## రైతులకు అందుబాటులో యూరియా




**నక్కపల్లి, సెప్టెంబరు 7:( మీ వార్త ప్రతినిధి ) :**గొడిచెర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో రైతులకు యూరియా సరఫరా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. గత ఆరేళ్లుగా ఆర్‌బీకేల ద్వారా అందుతున్న ఎరువులను ఇకపై సొసైటీ ద్వారా కూడా రైతులకు అందించేందుకు హోంమంత్రి అనితమ్మ ఆదేశాలు మేరకు వ్యవసాయ శాఖ అధికారులుద్వారా లైసెన్స్ పొందినట్లు పీఏసీఎస్ చైర్మన్ దార్ల కృష్ణ తెలిపారు. సంఘం పరిధిలోని 14 గ్రామాల రైతులకు అందుబాటులో ఉండేలా ముకుందరాజుపేటలో గోదాం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులకు సహాయపడటమే తమ ఉద్దేశమన్నారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్ ప్రగడ బుజ్జి, చిట్టూరి గోవిందు, సీఈవో కూరందాసు సూర్యనారాయణ, నాని, రైతులు పాల్గొన్నారు.

## పిక్కి రాముకు టీడీపీ నాయకుల ఆర్థిక సాయం



**నక్కపల్లి, సెప్టెంబరు 7:( మీ వార్త ప్రతినిధి ) :** విద్యుత్ స్థంభం నుంచి పడి తీవ్రంగా గాయపడి, శరీరం కాలిన పిక్కి రాము విశాఖపట్నంలోని సాయి గోదావరి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు రాజయ్యపేట టీడీపీ నాయకులు ఆసుపత్రికి వెళ్లి రామును, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైద్య ఖర్చుల కోసం రూ.30 వేల ఆర్థిక సాయం అందజేసి, ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయం అందేలా హోం మంత్రి దృష్టికి తీసుకెళ్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిక్కి శ్రీనివాసరావు, పిక్కి రాంబాబు, పిక్కి కోటి, ఎంపీటీసీ పిక్కి సత్యయ్య ,పీక్కి దేవుడు, పీక్కి కోదండరావు,వాసుపల్లి శివ,సిరిపిల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్‌పై దుర్భాషలు ప్రజాస్వామ్యంపై దాడి:

### కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు

**కరీంనగర్** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు తీవ్రంగా ఖండించారు. దళితుడైన స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి చేయడమేనని అన్నారు. స్పీకర్‌ను ఏకవచనంతో సంబోధించడం అవమానకరమని పేర్కొన్న ఆయన, తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఆయన ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని శాసనమండలి చైర్మన్‌ను కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తాతా మధు చట్టసభలకు పోటీ చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని రాజేందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవులను అవమానించడం వ్యక్తిగత దూషణ మాత్రమే కాకుండా రాజ్యాంగం, దళిత సమాజం, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు.

## ఆళ్లగడ్డ లో గణేష్ ఉత్సవాలు అందరూ సహకరించాలి.. సి. ఐ

**ఆళ్లగడ్డ** ఆళ్లగడ్డ పట్టణంలో గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని మతాల పెద్దలు, ప్రజలు సహకరించాలని ఆళ్లగడ్డ టౌన్ సీఐ నాగరాజరావు కోరారు. సోమవారం సాయంత్రం టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పీస్ కమిటీ సమావేశం నిర్వ హించారు. గణేష్ విగ్రహాల ఏర్పాటుకు సింగిల్ విండోలో ప్రత్యేక పోర్టల్ ద్వారా అనుమతి పొందాలన్నారు. గణేష్

## 23వ వార్డులో పెన్షన్ల కు అర్హులతో దరఖాస్తులు చేయించిన వర్తనపల్లి కాశీ



**తాడేపల్లిగూడెం,సెప్టెంబర్ 7 (మీ వార్త ప్రతినిధి)** ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో భాగంగా 10 రకాల పెన్షన్లను ప్రభుత్వం విడుదల చేయడంతో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం 23వ వార్డులో చేపట్టినట్లు జనసేన పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ పేర్కొన్నారు.ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశాల మేరకు 23వ వార్డులోని అర్హులైన వారిచే పెన్షన్లకు దరఖాస్తులు చేయించామన్నారు. సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు కొత్త పెన్షన్లకు ఆన్లైన్ దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు.పట్టణం లోని 35 వార్డులకు చెందిన ఇన్చార్జులు అర్హులైన ప్రతి ఒక్కరితో కొత్త పింఛన్లకు దరఖాస్తు చేయించాలని, పట్టణంలోని ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకుని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు హాజీ, బీజేపీ మహిళా నాయకురాలు వెంకటలక్ష్మి, 23వ వార్డు జనసేన నాయకులు కాకర్ల శివ, వెంకటేష్, బండి దుర్గాప్రసాద్, అంజి, దుర్గ, కూటమి సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వెంకట రాంబాబు కు సత్కారం



**ముమ్మిడివరం, సెప్టెంబర్ 7 (మీ వార్త విలేఖరి ):**మండల పరిధిలోని కొత్తలంక గ్రామంలో సచివాలయం వద్ద గల మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పనిచేయుచున్న మట్టపర్తి వెంకట రాంబాబు కు డాక్టర్ బి అర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు వచ్చిన సందర్భంగా సచివాలయ సిబ్బంది అయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో వీఆర్వో రెడ్డి సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి డి ఈశ్వరరావు, వెల్ఫె రెసిడెంట్ పి రాజేష్, మహిళా పోలీస్ డి భాగ్యలక్ష్మి, అగ్రికల్చర్ అసిస్టెంట్ పెమ్మాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.కొత్తలంక పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులు అడబాల కాశీ విశ్వేశ్వర రావు,స్కూల్ చైర్మన్ జయను లక్ష్మణ కుమార్, కాశీ బాబాయి ఎమ్ శ్రీనివాస్ మరియు ఎంపీపీ యూపీ స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులు అవార్డు గ్రహీత రాంబాబు ను పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు ..

## బోటు ప్రమాదంలో మృతి చెందిన బాబ్జీ కుటుంబానికి పదివేలు ఆర్థిక సహాయం అందజేసిన టిడిపి సీనియర్ నాయకులు గొర్రెల రాజుబాబు,,



**పాయకరావుపేట, మీ వార్తా ప్రతినిధి,,**సెప్టెంబరు 7 : మండలంలోని వెంకటనగరం వద్ద సముద్రంలో ఆగస్టు 16 న జరిగిన బోటు ప్రమాదంలో మృతి చెందిన ఉప్పాడ బాబ్జీ కుటుంబ సభ్యులను సోమవారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, పాయకరావుపేట మాజీ వైస్ ఎంపిపి గొర్రెల రాజుబాబు పరామర్శించారు. ఈ సందర్భంగా తీవ్ర విషాదంలో ఉన్న బాబ్జీ కుటుంబానికి పది వేలు రూపాయలు ఆర్థిక సాయం, యాభై కేజీల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ... ఆపద సమయంలో బాధిత కుటుంబానికి తమ వంతు సహాయం అందించడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. బాబ్జీ కుటుంబానికి భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటనగరం సర్పంచ్ వంకా వెంకట రమణ, మాజీ జెడ్పీటీసీ వంకా సత్యనారాయణ, పార్టీ సీనియర్ నాయకులు తలారి రాజా తదితరులు ాల్గొన్నారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లపై కూటమి నాయకులతో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సమావేశం



**పి. గన్నవరం సెప్టెంబర్ 07 (మీ వార్త విలేఖరి ).** ఈ నెల 9 న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన లో భాగంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు.
ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, జన సమీకరణ తదితర అంశాలపై నాలుగు మండలాలకు చెందిన కూటమి నాయకులతో ఎమ్మెల్యే చర్చించారు. నియోజకవర్గానికి అవసరమైన పలు అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, వాటిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జాలం శ్రీనివాస రాజా, బోనం నాగేశ్వరరావు, పత్తిపాటి ఉమామహేశ్వరి,మార్కెట్ యార్డ్ చైర్మన్ పెనుమల లక్ష్మి, మొల్లేటి శ్రీనివాస్,శిరిగిడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్ , మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, సొసైటీ చైర్మన్, గ్రామ శాఖ అధ్యక్షులు,కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

Edited Printed Published & Owned by U. SHEKHAR. And Printed at Mani Raghava Printers, #A-20, Vambay Colony, Hyderabad, Rajendranagar, Rangareddy, Telangana.
Published at Manikanta Publications, H.No. 3-67/3/66, Netaji Nagar, Nallagandla, Serilingampally, Rangareddy (Dist), Telangana, EDITOR U.SHEKHAR, RNI. NO. TEL/2018/77112